కలం
# నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ బుధవారం 5 మార్చి 2025
సంపుటి: 14, సంచిక: 332 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నం



హైదరాబాద్ మార్చి 4 (నిఘా న్యూస్) ప్రముఖ సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నం చేశారు.హైదరాబాద్ లోని నిజాంపేట్ లో తన భర్తతో కలిసి ఆమె నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలోనే కల్పన సూసైడ్ అటెంప్ట్ చేశారు. వెంటనే ఆమెను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.




## మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ కానుక

2

## మీనాక్షి వైద్యంతో కాంగ్రెస్‌లో కలహాలు ఖతం అయ్యేనా?

పటాన్ చెరు కాంగ్రెస్‌లో గూడెం వర్సెస్ కాటా: మీనాక్షి నటరాజన్ సీరియస్



2

## తెలంగాణకు కేంద్రం ... రెండు వేల కోట్ల బకాయిలు



సీఎంఆర్ డెలివరి గడువును పొడిగించాలి

రేషన్ కార్డుల కోటా కింద సబ్సీడీని కేంద్రం అందించాలి

నీటి ప్రాజెక్టుల అనుమతుల పైనా కేంద్రంతో సుదీర్ఘ చర్చలు

హైదరాబాద్ చేరుకున్న సీఎం, ఇతర మంత్రులు

హైదరాబాద్ మార్చి 4 (నిఘా న్యూస్) ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన రెండోరోజు కొనసాగింది. కేంద్ర ఆహార, పౌర ..మిగతా 2లో



2

ఫిరాయింపు

## ఎమ్మెల్యేలపై సుప్రీం నోటీసులు

స్పీకర్‌తో సంప్రదించి తగు చర్యలకు ఎంత సమయం పడుతుందో తెలుపండి



2

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతులు

## సముద్రంలో కలుస్తున్న నీటిని... వాడుకుంటే తప్పా!

గోదావరి నదిపై మరిన్ని ప్రాజెక్టులు నిర్మించి నీళ్లు వాడుకోవాలని సూచన

తెలంగాణ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుపై తాము రాజకీయం చేయలేదు

బనకచర్లపై రాజకీయం ఎందుకు చేస్తున్నారు

కాలేశ్వరం కట్టడాన్ని మేము అభినందించాము

రెండు రాష్ట్రాలూ తనకు రెండు కళ్లులాంటివి

తెలుగుదేశం విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేసిన సీఎం రేవంత్



అమరావతి మార్చి 4 (నిఘా న్యూస్) పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. టీడీపీ అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొని మాట్లాడిన చంద్రబాబు నాయుడు. బనకచర్ల ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలూ తనకు రెండు కళ్లులాంటివని మరోసారి చెప్పిన చంద్రబాబు. తెలుగుజాతి కోసం పెట్టిన పార్టీ తెలుగుదేశమన్నారు. గోదావరి నదిపై తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎంత ముఖ్యమైనదో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బనకచర్ల ప్రాజెక్ట్ అంత ముఖ్యమైనదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. తెలంగాణ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుపై తాము రాజకీయం చేయలేదన్న చంద్రబాబు. బనకచర్ల ప్రాజెక్టును కావాలనే రాజకీయం చేస్తున్నారన్నారు. సముద్రంలో కలిసే నీటిని వాడుకుంటే రాజకీయం చేయడం తగదని చంద్రబాబు నాయుడు హితవు పలికారు. మరోవైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల ఢిల్లీలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ పర్యటనలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల గురించి ప్రస్తావించారు. అలాగే గోదావరిపై ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలోనే బనకచర్ల ప్రాజెక్టును ఓ పార్టీ రాజకీయం చేస్తోందని చంద్రబాబు విమర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణలో ..మిగతా 2లో



## అమ్మకాలకు బ్రాండ్ అంబాసిడర్ బీజేపీ

బీజేపీని నమ్మితే ప్రభుత్వ సంస్థల అమ్ముడు ఖాయం

ఆదిలాబాద్‌లోని సీసీసీని అమ్మేందుకు సిద్ధపడటం దుర్మార్గం

నమ్మి ఓటేసినందుకు బిజెపి బహుమతి : కేటీఆర్

హైదరాబాద్ మార్చి 4(నిఘా న్యూస్) బీజేపీని నమ్ముకుంటే చివరకు నడీరోడ్డుపై అమ్మేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీసీఐని పునః ప్రారంభిస్తామని మాటిచ్చి, ఓట్లు, సీట్లు దండుకుని ..మిగతా 2లో

## కేసీఆర్‌ను అనర్హుడిగా ప్రకటించండి

ఆయన అసెంబ్లీకి రావడం లేదు

హైకోర్టులో పిటిషన్ దాఖలు



2



## ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

సెమీస్‌లో ఆస్ట్రేలియాపై గ్రాండ్ విక్టరీ

ఆస్ట్రేలియాపై 4 వికెట్ల తేడాతో ఘన విజయం

న్యూఢిల్లీ మార్చి 4 (నిఘా న్యూస్) ఆదివారం జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫైనల్‌కు భారత్ చేరుకుంది. 265 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు 48 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విరాట్ కోహ్లీ 84 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆడమ్ జంపా బౌలింగ్‌లో బెన్ ద్వార్షిస్‌కు క్యాచ్ ఇచ్చాడు. విరాట్ కాకుండా అక్షర్ పటేల్ 27, శ్రేయాస్ అయ్యర్ 45, కెప్టెన్ రోహిత్ శర్మ 28 పరుగులు చేయగా, శుభ్మాన్ గిల్ 8 పరుగులు ..మిగతా 2లో

## గ్రామర్ తెలియనోళ్లు... యూనివర్సిటీల వైస్‌ఛాన్స్‌లర్లు



మేము ఎవరినీ రాజీనామా చేయమని బెదిరించలేదు : లోకేశ్

బెదిరించారని ఆధారాలు చూపించినా వివరణ ఇవ్వని ప్రభుత్వం: బొత్స

వీసీల రాజీనామాలపై సభలో రగడ

అమరావతి మార్చి 4 (నిఘా న్యూస్) వీసీల రాజీనామా అంశంపై శాసన మండలిలో వాడీవేడీ చర్చ జరిగింది. వైకాపా ఆరోపణలపై నిగ్గుతేల్చేందుకు ప్రివిలేజ్ కమిటీకి పంపాలని మంత్రి లోకేశ్.. స్పీకర్‌ను కోరారు. వీసీల రాజీనామా లేఖల్లో 'బెదిరించినట్లు' అనే పదం ఎక్కడా లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వైకాపా నియమించిన వీసీలకు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ కూడా రాదని ఎద్దేవా చేశారు. వీసీల రాజీనామా లేఖల్లో బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయా అని ప్రశ్నించారు. 'రాజీనామా ..మిగతా 2లో

## మాముునూరు వద్ద భూములు కోల్పోతున్న వారి ఆందోళన

నిలిచిపోయిన ఎయిర్ పోర్టు సర్వే పనులు

వరంగల్ మార్చి 4(నిఘా న్యూస్) మామునూరు ఎయిర్‌పోర్టు సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని అన్నదాతలు మంగళవారం ఉదయం నిరసనకు దిగారు. నక్కల పల్లి రోడ్డు తీసేయవద్దని ..మిగతా 2లో





## పులి పిల్లలకు... పాలు పట్టిన ప్రధాని

ప్రపంచంలోనే అతి పెద్దదైన పశు వైద్యశాల

వంతారాను సందర్శించిన ప్రధాని మోడీ

జామ్‌నగర్ మార్చి 4 (నిఘా న్యూస్) పులిపిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు , జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించారు. వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోదీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. మంగళవారం జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ..మిగతా 2లో

# అమ్మకాలకు బ్రాండ్ అంబాసిడర్ బీజేపీ

మొదటి పేజీ తరువాయి...

చివరికి స్క్రాప్ కింద అమ్మేస్తారా అంటూ నిలదీశారు. సీసీఐపైనే కోటి ఆశలు పెట్టుకుని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా, వారి ఆర్తనాదాలు వినిపించడం లేదా మండిపడ్డారు. ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్కకట్టి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవడం, సీసీఐ సంస్థ గొంతు కోయడమేనన్నారు. నిర్మాణ రంగంలో సిమెంటుకున్న డిమాండ్ దృష్ట్యా సీసీఐని ప్రారంభించి కార్మికులను కాపాడాలని బీఆర్ఎస్ పదుల సార్లు కేంద్రమంత్రులకు మొరపెట్టుకున్నా కనికరించకపోవడం ఆదిలాబాద్‌కు వెన్నుపోటు పొడవడమేనని చెప్పారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల్లో టౌన్ షిప్, 48 మిలియన్ లైమ్ స్టోన్ నిల్వలతో సకల వనరులున్న సంస్థను అంగడి సరుకుగా మార్చేసిన కేంద్రానికి ఉద్యోగులు, కార్మికుల గోస తగలక మానదన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాకా కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం. సంస్థ పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రోత్సాహం అందించి వాటిని ఆదుకోవాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తున్నది. అస్మదీయులకు ప్రభుత్వ సంస్థలను కట్టబెడుతూ ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నది. కార్పొరేట్‌కు అప్పగించే పనుల్లో



భాగంగా ఆదిలాబాద్ సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మూతబడిన సీసీఐ యంత్ర సామగ్రిని స్క్రాప్ కింద వేలం వేయడానికి టెండర్లను ఆహ్వానించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సిమెంటుకు డిమాండ్ భారీగా ఉంది. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అన్ని వనరులు ఉన్నాయి. సీసీఐని ప్రారంభిస్తే 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 2,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సీసీఐని ప్రారంభించాలని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. పరిశ్రమ పునఃప్రారంభానికి రాయితీలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేలను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. కానీ, మోదీ సర్కారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా వేలాది మంది ఉపాధిని పట్టించుకోకుండా, స్థానికుల మనోభావాలను లెక్కచేయకుండా పరిశ్రమను కేంద్రం ప్రభుత్వం విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రంలోని మోదీ సర్కారు ఈ పరిశ్రమను అమ్మేందుకు మూడేండ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నది. మొదటిసారి స్క్రాప్ ఈ-వేలంలో భాగంగా 2022 మే 5న ఆన్‌లైన్‌లో బిడ్లను ఆహ్వానించింది. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పట్లో వేలం ప్రక్రియ నిలిచిపోయింది. మరోసారి ఈ టెండర్లను కేంద్రం పిలిచింది. ఈ నెల 7 నుంచి టెండర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవచ్చని సూచించింది. మూతబడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమలో 71 పరికరాలకు సంబంధించి వేలం ప్రారంభ ధర రూ.43.30 కోట్లు ఉంటుందని అధికారులు తెలియజేశారు. దీంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ మార్చి 4 (నిఘా న్యూస్) బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత విచారణ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారో స్పీకర్‌తో సంప్రదించి వివరాలు అందించాలని ధర్మాసనం ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయడానికి ఇప్పటి వరకు తమకు ఎలాంటి నోటీసులు రాలేదని, సాంకేతికంగా ఇది గమనించాల్సిన విషయమని రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈనెల 22లోపు నోటీసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ మాసిహ్ జార్జ్‌ల ధర్మాసనం మార్చి 25కి వాయిదా వేసింది.

## మీనాక్షి వైద్యంతో కాంగ్రెస్‌లో కలహాలు ఖతం అయ్యేనా?

**పటాన్ చెరు కాంగ్రెస్‌లో గూడెం వర్సెస్ కాటా : మీనాక్షి నటరాజన్ సీరియస్**

హైదరాబాద్ మార్చి 4 (నిఘా న్యూస్) తెలంగాణలో అధికార కాంగ్రెస్ లో గత కొంత కాలంగా హీట్ పుట్టిస్తున్న పటాన్ చెరు కాంగ్రెస్ పంచాయతీ ఎపిసోడ్ నూతన ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. ఇవాళ గాంధీ భవన్ లో జరిగిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంపై సమీక్ష సందర్భంగా పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అంశాన్ని కాటా శ్రీనివాస్ సమావేశంలో ప్రస్తావించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం తాను పని చేశానని, ఇప్పుడు నేను కష్టకాలంలో ఉంటే ఎవరూ అండగా లేరని కాటా శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహా, జిల్లా ఇన్ చార్జి మంత్రి కొండా సురేఖా, జగ్గారెడ్డి తదితర ముఖ్యనేతలు హాజరైన ఈ సమావేశంలో పటాన్ చెరు పంచాయితీపై నటరాజన్ క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ నాయకులను కాపాడుకోవాలి కదా అంటూ మీనాక్షి పార్టీ నేతలకు చురకలు అంటిచారు. కాటా శ్రీనివాస్‌తో మాట్లాడిన మీనాక్షి, పార్టీ అన్నీ గమనిస్తోందని, కార్య కర్తలకు అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పథకాల ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశం ముగిసిన అనంతరం జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహతో మీనాక్షి నటరాజన్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పటాన్ చెరులో ఏం జరుగుతోందని వివరణ అడిగారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో తాజాగా మీనాక్షి నటరాజన్ ఫోకస్ చేయడం పటాన్ చెరు పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అందరూ సమన్వ యంతో పని చేయాలని అల్టిమేటం జారీ చేయడంతో రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం ఎలా ఉండబోతున్నదనేది ఉత్కంఠగా మారింది.

## తెలంగాణకు కేంద్రం.. రెండు వేల కోట్ల బకాయిలు

మొదటి పేజీ తరువాయి...

సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో సీఎం, మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించినట్లు తెలుస్తోంది. 2014-15 సంవత్సరానికి సంబంధించి సేకరించిన ధాన్యం బకాయిలు రూ.1,468.94 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రికి వినతి చేశారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ. 343.27 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎంఆర్ డెలివరి గడువును పొడిగించాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. గత పదేళ్లుగా తెలంగాణలో ఎక్కడా కూడా రేషన్ కార్డు అమలుకాలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు రేషన్ కార్డులను ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే రేషన్ కార్డుల ప్రక్రియను కూడా ముమ్మరం చేశారు. రేషన్ కార్డుల కోటా కింద రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు ధాన్యం, సబ్సీడీని కేంద్రం ఇవ్వాల్సి ఉ ంటుంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధాన్యం సేకరణ పెద్ద ఎత్తున జరిగింది. దాదాపు 66.76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో ధాన్యం ప్రెక్యూర్‌కు సంబంధించి కేంద్రం తన వాటాను కొనుగోలు చేయాలని, అలాగే పౌరసరఫరాల శాఖకు సంబంధించి గతంలో పెండింగ్ లో ఉన్న నిధులతో పాటు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధులపై కూడా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ దృష్టికి సీఎం తీసుకెళ్లారు. దేశంలో ధాన్యం సేకరణలో పంజాబ్ మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో హర్యానా, మూడో స్థానంలో తెలంగాణ ఉంది. ఇన్ని లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా,సన్న బియ్యానికి రూ.500 బోనస్‌ను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో కంటే కూడా ఈ ఏడాది ఎక్కువగా ధాన్యం సేకరణ జరిగింది. కాళేశ్వరం నుంచి నీళ్లు ఇవ్వకపోయినప్పటికీ లక్షల హెక్టార్లలో పంటను పండిరచి రూ.500 సబ్సీడీతో పంటను కొనుగోలు చేసింది. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉగాది నుంచి రేషన్ సరఫరా ద్వారా సన్న బియ్యాన్ని ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన నిధులను తెలంగాణకు వెంటనే మంజూరు చేయాల్సిందిగా కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఆ శాఖకు సంబంధించిన ఇతర అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సోమవారం తొలిరోజు కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు, సీఎం రేవంత్, మంత్రి ఉ త్తమ్. దాదాపు దాదాపు గంట పాటు వీరి సమావేశం కొనసాగింది. తెలంగాణ రాష్ట్రంలో పలు నీటి ప్రాజెక్టులపై ప్రధానంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పర్యావరణ అనుమతులు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంగళవారం కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో భేటీ అయిన సీఎం రేవంత్, ఉత్తమ్ సాయంత్రం ఢిల్లీ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్నారు.

## సముద్రంలో కలుస్తున్న నీటిని... వాడుకుంటే తప్పా!

మొదటి పేజీ తరువాయి...

నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును తాను ఎప్పుడు వ్యతిరేకించలేదన్న చంద్రబాబు. గోదావరి నదిపై ప్రాజెక్టులు నిర్మించి నీళ్లు వాడుకోవాలని సూచించారు. సముద్రంలోకి పోయే నీళ్లను.. కరవు ప్రాంతానికి తీసుకెళ్తే బాధపడాల్సిన అవసరం లేదంటూ పరోక్షంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలకు సూచించారు. గోదావరి నీళ్లు పోలవరం నుంచి బనకచర్లకు తీసుకెళ్తానని గతంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు రాష్ట్ర పునర్నిర్మాణానికి సంజీవని అని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. మూడు పార్టీలు కలిసి పనిచేశాయని మూడు పార్టీల ఐకమత్యం శాశ్వతంగా ఉండాలని ఆకాంక్షించారు.

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

హైదరాబాద్ మార్చి 4 (నిఘా న్యూస్) తెలంగాణలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు పది లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో అబ్బాయిలు 4,97,528 మంది ఉండగా.. అమ్మాయిలు 4,99,443 మంది ఉన్నారు. మొత్తం 1,532 కేంద్రాల్లో జరగనున్న పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. ఈసారి పరీక్షా కేంద్రాల గుర్తింపు కోసం హాల్ టిక్కెట్లపై క్యూర్ కోడ్‌లను సైతం ముద్రించటం విశేషం. ఇక పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరా సర్వైలెన్స్, పెద్ద సంఖ్యలో స్క్వాడ్ లను సైతం ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసిందని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు.మార్చి 5వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు అంటే, ఉ దయం 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రానికి కాస్త ముందుగా చేరుకుంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని బోర్డు అధికారులు విద్యార్థులకు సూచించారు. ఇక నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య.. విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాన్ని అందజేస్తారు. వీటిని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈసారి ఇంటర్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీనిని స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం లొకేషన్ సులువుగా తెలుసుకోవచ్చు.ప్రశ్నపత్రంపై సీరియల్ నెంబరు ముద్రిస్తున్నారు. దీంతో ఏ నెంబర్ ఉన్న పేపర్, ఏ విద్యార్థికి వెళ్తుందో సులువుగా తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఈ పరీక్షల వేళ, స్మార్ట్ వాచ్‌లతోపాటు అనలాగ్ వాచ్‌లను సైతం నిషేధిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సారి పరీక్షల వేళ, చేతి గడియారాలనూ కూడా అనుమతించడం లేదు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించారు. మొత్తం 75 మంది సిబ్బంది.. ఈ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నారు. విద్యార్థుల పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఈ హెల్ప్‌లైన్ నెంబరు 92402 05555 ను సంప్రదించవచ్చునని బోర్డు కార్యాలయం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్‌విరిడియట్ పరీక్షలు ప్రారంభమైనాయి. మార్చి 1వ తేదీ నుంచి మొదటి సంవత్సరం, మార్చి 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైనాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకొనేందుకు వాట్సప్ నెంబర్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

## గ్రామర్ తెలియనోళ్లు... యూనివర్సిటీల వైస్‌ఛాన్స్‌లర్లు

మొదటి పేజీ తరువాయి...

చేసిన ఒక వీసీ.. రాజారెడ్డి చెల్లెలి కోడలు. రాజీనామా చేసిన ప్రసాద్‌రెడ్డి.. వైకాపా కార్యకర్త. జగన్ పుట్టినరోజు వేడుకలు వర్సిటీలో చేసిన వ్యక్తి ఈ ప్రసాద్ రెడ్డి అని పేర్కొన్నారు. పార్టీ కోసం సర్వేలు చేయించిన ఘనత ఆనాటి వీసీలదని లోకేశ్ వ్యాఖ్యానించారు. వీసీలను బెదరించిన వ్యవహారంపై ఏపీ శాసనమండలిలో రగడ చోటు చేసుకోవడంతో సభ వాయిదా పడిరది. అనంతరం శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అసెంబ్లీ విరిడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ వీసీల రాజనామాలపై దర్యాప్తు జరపమని రెండు రోజుల క్రితం కోరామని. ఆధారాలు ఇవ్వాలని ప్రభుత్వం కోరిందన్నారు. అన్ని ఆధారాలు నేడు మండలి ముందుకి తీసుకొని వచ్చినట్లు తెలిపారు. గవర్నర్ నియమించిన వీసీలను ఉన్నత విద్యాశాఖ అధికారులు ఏ విధంగా రాజీనామాలు చేయమని చెపుతారని విచారణ చేయమని చెప్పామన్నారు. అయితే ప్రభుత్వం తోక ముడుచుకొని వెళ్ళిందని విమర్శించారు. విచారణ చేయకుండా సవాల్ విసిరారని ఈరోజు ఏమైందని ప్రశ్నించారు. సమాధానం చెప్పలేక దాబాయింపు, బుకాయింపులు, పరుష పదజాలంతో దూషణలు చేశారన్నారు. విచారణ జరగాలని వాస్తవాలు బయటకు రావాలని డిమాండ్ చేశారు. వీసీలు తప్పులు చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. బెదిరింపులతో రాజీనామాలు చేయించడం విద్యా వ్యవస్థకు కళంకమని ఎమ్మెల్సీ అన్నారు. వీసీలుగా క్వాలిఫైడ్ వాళ్ళను మాత్రమే నియమిస్తారని, దానికి ఒక కమిటి ఉందని తెలిపారు. వీసీలుగా క్వాలిఫైడ్ కానీ వాళ్ళని నియమిస్తే విచారణ జరపాలన్నారు. ఉన్నత విద్యా శాఖ ఆదేశాలతో రాజీనామా చేయాలని ఆదేశించారని, అన్న దానిపై విచారణ జరపాలని అడుగు తున్నామన్నారు.



## పులి పిల్లలకు... పాలు పట్టిన ప్రధాని

మొదటి పేజీ తరువాయి...

ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన పశు వైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదల్కైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు. దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ముఖ్య లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో ఇది ఉన్నది. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇందులో దాదాపు 2 వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేల సంఖ్యలో ఉ ద్యోగులు పని చేస్తున్నారు.

## కేసీఆర్‌ను అనర్హుడిగా ప్రకటించండి

హైదరాబాద్ మార్చి 4(నిఘా న్యూస్) భారాస అధినేత, ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విజయ్‌పాల్‌రెడ్డి వేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కోర్టులో విచారణ జరిగింది. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కొన్ని నెలలుగా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడం లేదని, ఇలా సమావేశాలకు హాజరు కాకుంటే చట్టప్రకారం అనర్హుడిగా ప్రకటించవచ్చన్నారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాగా ఈ వ్యాజ్యంలో జోక్యం చేసుకోవడానికి కోర్టు పరిధి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ పిల్‌కు అర్హత లేదని శాసనసభ వ్యవహారాల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, కోర్టులు జోక్యం చేసుకోవచ్చని ఈ మేరకు వాదనలు వినిపించడానికి గడువు కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో విచారణను కోర్టు 2 వారాలకు వాయిదా వేసింది.




## ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

మొదటి పేజీ తరువాయి...

చేసి ఔటయ్యాడు. అక్షర్ ను నాథన్ ఎల్లిస్ బౌలింగ్ లో బౌల్డ్ చేయగా, శ్రేయాస్ ను ఆడమ్ జంపా బౌలింగ్ లో బౌల్డ్ చేశాడు. కొన్నోలీ బౌలింగ్‌లో రోహిత్ కూపర్ ఎల్బీగా వెనుదిరిగాడు. అంతకుముందు ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ 96 బంతుల్లో 73 పరుగులు చేశాడు. అలెక్స్ కారీ 61 పరుగులు, ట్రావిస్ హెడ్ 39 పరుగులు చేశారు. భారత్ తరఫున మహ్మద్ షమీ 3 వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, వరుణ్ చక్రవర్తి చెరో 2-2 వికెట్లు పడగొట్టారు. మ్యాచ్ లో టీమిండియా బౌలర్లు అదరగొట్టారు. ఒక దశలో 300 పరుగులు చేసేలా కనిపించిన ఆసీస్ కు చివరి ఓవర్లలో కళ్లెం వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌట్కైంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (96 బంతుల్లో 73బీ 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ గా నిలిచాడు. అలెక్స్ క్యారీ (57 బంతుల్లో 61బీ 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో రాణించాడు. ట్రావిస్ హెడ్ (39) దూకుడుగా ఇన్నింగ్స్ ను ఆరంభించినా వరుణ్ చక్రవర్తికి బలయ్యాడు. భారత బౌలర్లలో మొహమ్మద్ షమీ 3 వికెట్లు తీశాడు. వరుణ్ చక్రవర్తి, రవీంద్ర జడేజాలకు చెరో రెండు వికెట్లు లభించాయి. బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. మ్యాథ్యూ షార్ట్ స్థానంలో జట్టులోకి వచ్చిన కూపర్ (0) డకౌట్ అయ్యాడు. అయితే ఆ ఆనందం భారత బౌలర్లకు ఎంతో సేపు నిలవలేదు. హెడ్ హిట్టింగ్ మొదలు పెట్టాడు. ఎడాపెడా బౌ ండరీలు బాదాడు. దాంతో ఆసీస్ ఓవర్ కు 6 పరుగుల చొప్పున రన్ రేట్ ను మెయింటేన్ చేస్తూ ముందుకు సాగింది. అయితే వరుణ్ చక్రవర్తి డేంజరస్ హెడ్ ను అవుట్ చేశాడు. అనంతరం మార్నస్ లబుషేన్ (29)తో కలిసి స్మిత్ జట్టును ముందుకు నడిపాడు. వీరిద్దరు నెమ్మదిగా ఆడారు. అయితే కీలక సమయంలో లబుషేన్ అవుటయ్యాడు. ఆ వెంటనే ఇంగ్లీస్ (11) కూడా పెవిలియన్ కు చేరాడు. ఈ దశలో స్మిత్, అలెక్స్ క్యారీలు జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు సమయోచితంగా ఆడారు. 30 ఓవర్లు దాటాకా వీరిద్దరు హిట్టింగ్ చేశారు. ఫలితంగా ఆస్ట్రేలియా 300 పరుగులు చేసేలా కనిపించింది. అయితే స్మిత్ ను షమీ అవుట్ చేశాడు. ఆ వెంటనే సిక్సర్ కొట్టి ఊపుమీద కనిపించిన మ్యాక్స్ వెల్ (7)ను అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక చివర్లో అలెక్స్ క్యారీ అవుటవ్వడంతో ఆస్ట్రేలియా 264 పరుగులకు పరిమితం అయ్యింది.

## మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

**అంతర్జాతీయ మహిళా దినోత్సవ కానుక**

హైదరాబాద్ మార్చి4(నిఘా న్యూస్) అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మహిళ సమాఖ్యలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా సంఘాలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం అందుకు సంబంధించిన జీవోను రేవంత్ సర్కార్ జారీ చేసింది. తొలి విడతలో 150 మహిళా సమాఖ్యలకు 150 ఆర్టీసీ బస్సులు కేటాయించనున్నారు. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె కింద రూ. 77,220 చెల్లించనుంది. ఇక బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు బ్యాంకు గ్యారంటీ సైతం ప్రభుత్వం ఇవ్వనుంది. దీంతో దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను నడపనున్నాయి. ఆ రోజు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొని, ఈ బస్సులను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించనున్నారు. మరోవైపు సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరిట మహాలక్ష్మీ పథకాన్ని చేపట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అయితే ఈ పథకం వల్ల రాష్ట్రంలోని మహిళలు. ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక అంతకు ముందు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఉచిత బస్సు ప్రయాణాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇక్కడ సైతం ఆ పార్టీ అధికారంలోకి రావడంతో తెలంగాణలో సైతం తమ పార్టీ అధికారంలోకి వస్తే, ఈ పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. దీంతో తెలంగాణ ఓటరు సైతం కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీని అమలు చేస్తోంది. దీంతో మహిళా సంఘాలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించడం తెలంగాణ మహిళలకు శుభవార్తగా పరిగణించాలి.

## మామునూరు వద్ద భూములు కోల్పోతున్న వారి ఆందోళన

మొదటి పేజీ తరువాయి...

డిమాండ్ చేశారు. తమకు రోడ్డు మార్గం చూపాలని ఆందోళనకు దిగిన రైతులు. ఆందోళనలో భారీగా మహిళలు పాల్గొన్నారు. సమాచారం అందిన వెంటనే మామునూరు ఎయిర్‌పోర్టు వద్దకు భారీగా పోలీసులు మోహరించారు. మామునూరు ఎయిర్‌పోర్టు రావడం సంతోషకరమే అయినా భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మాములూరుకు సమీపంలో ఉన్న గవిచర్ల క్రాస్ రోడ్డు మీదుగా నక్కలపల్లి, గుంటూరుపల్లి, నెక్కొండ వెళ్లే ప్రధాన రహదారి మొత్తం ఎయిర్‌పోర్టులో కలిసిపోతుంది. రహదారి మూసివేస్తుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కలపల్లి ప్రధాన రహదారిపై రైతులు ఆందోళనకు దిగారు. ఎయిర్‌పోర్టును తామేమి వ్యతిరేకించడం లేదని రైతులు చెబుతున్నారు. ఇక్కడ విమానాశ్రయం రావడం సంతోషకరమన్నారు. ఎయిర్‌పోర్టు రావడం వల్ల ఎంత్కెతే లాభపడుతున్నామో.. అంతకంటే ఎక్కువ నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాకపోవడంతో ధర్నాకు దిగినట్లు వారు తెలిపారు. మార్కెట్ వాల్యూ ప్రకారమే రేట్ ఇస్తామని లేదా రైతులు కోరుకున్న చోటే వ్యవసాయ ఆమోద యోగ్యమైన భూములు ఇస్తామని మంత్రి సురేఖ చెప్పారని అన్నారు. నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని కూడా మాట ఇచ్చినట్లు తెలిపారు. కానీ ఇప్పుడు భూములకు భూమి ఇవ్వకపోవడమే కాకుండా, తమ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గాన్ని కూడా మూసి వేస్తున్నారని అంతే కాకుండా కొత్తగా రోడ్డు మార్గానికి ప్రభుత్వం ఆసక్తి చూపించడం లేదని అన్నదాతలు వాపోయారు. తమకు కచ్చితంగా న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా తెలంగాణ రెండవ ఎయిర్‌పోర్టుకు



మార్గం సుగమం అయిన నేపథ్యంలో ఇక్కడ భూసేకరణకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం భూసేకరణ సర్వే చేయాలని నిర్ణయించారు అధికారులు. అయితే సర్వేను అడ్డుకునేందుకు రైతులు, మహిళలు పెద్ద ఎత్తున అక్కడకు తరలి వచ్చారు. కాసేపటి క్రితమే ఎయిర్ పోర్ట్ భూసేకరణ సర్వేకోసం హనుమకొండ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరరావు అక్కడకు వెళ్లారు. దీంతో అధికారులను రైతులు, మహిళలు నిలదీశారు. తమకు న్యాయం చేయాలని అధికారులను నిర్వాసితులు అడ్డుకున్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో కలెక్టర్‌తో వరంగల్ ఆర్డీవో, తహసీల్దార్ ఫోన్ లో సంప్రదింపులు జరుపారు. ప్రస్తుతం భూసేకరణ సర్వే తాత్కాలికంగా నిలిచి పోయింది.

# మండల కార్యాలయం భవన నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్



**నారాయణపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** నారాయణ పేట జిల్లాలోని కొత్త మండలాలైన కొత్తపల్లి, గుండుమాల్ మండల కాంప్లెక్స్ భవన నిర్మాణ స్థలాలను కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం పరిశీలించారు. ఒక్కో మండల కాంప్లెక్స్ భవన నిర్మాణాన్ని రూ. 8.80 కోట్ల వ్యయంతో చేపట్టనుండగా కొత్తపల్లి మండల కేంద్రానికి సమీపంలోని వేయి గజాల స్థలంలో కాంప్లెక్స్ నిర్మించేందుకు అధికారులు మార్కింగ్ వేయగా జిల్లా కలెక్టర్ ఆ స్థలాన్ని, కాంప్లెక్స్ భవన నమూనా చిత్రాన్ని పరిశీలించారు. కాంప్లెక్స్ కు రోడ్డు నుంచి రహదారి సౌకర్యం ఎలా ఏర్పాటు చేస్తారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత గుండుమల్ పిహెచ్ సి పక్కన గల రెండు ఎకరాల స్థలంలో నిర్మించే గుండుమాల్ మండల కాంప్లెక్స్ నిర్మాణ స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆ స్థలంలో ఉన్న బండ రాలను తొలగించిన తర్వాత భవన నిర్మాణానికి మార్కింగ్ వేస్తామని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. మిగతా స్థలంలో జూనియర్ కళాశాల నిర్మాణానికి ప్రతిపాదించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ గుండుమాల్ – లింగాల్ చేడ్ బీటి రోడ్డు పనులను పరిశీలించి మిగతా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పీ ఆర్ ఈ ఈ హీర్యా నాయక్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి, గుండుమాల్ తహసీల్దార్లు జయ ప్రకాష్, భాస్కర స్వామి, ఆయా మండలాల ఎంపీడీవో లు సంబ%శీ%ధిత అధికారులు పాల్గొన్నారు.

# హర్యానా గవర్నర్ దత్తాత్రేయను కలిసిన జిల్లా ఎస్పీ

**కొమురవెల్లిలో పూజలు నిర్వహించిన బండారు దత్తాత్రేయ**



**సిద్దిపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కొమురవెల్లి మల్లికార్జున స్వామి, కొండపోచమ్మ తల్లి దర్శనానికి వచ్చిన సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, కొము రవెల్లి టెంపుల్ గెస్ట్ హౌస్ వద్ద కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. తదనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన గవర్నర్. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గవర్నర్ పర్యటన సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసిపి సతీష్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్ చేర్యాల సిఐ శ్రీను కొమురవెల్లి ఎస్ఐ రాజు ఆర్ఎస్ఐ రోహిత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తదానం చేసిన ఏఆర్ కానిస్టేబుల్ ప్రశాంత్



**సిద్దిపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** సిద్దిపేట పట్టణానికి చెందిన వ్యక్తి సిద్దిపేట ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అత్యవస రంగా ఆపరేషన్ సమయంలో బి పాజిటివ్ బ్లడ్ అవసరము ఉన్నదని పోలీస్ మిత్రులు ద్వారా సమాచారం తెలుసుకున్న ఏఆర్ కానిస్టేబుల్ ప్రశాంత్. వెంటనే స్పందించి సిద్దిపేట మిత్ర బ్లడ్ బ్యాంక్ వెళ్లి బ్లడ్ డొనేట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న అతని కుటుంబ సభ్యులు అత్యవసర సమయంలో బ్లడ్ డొనేట్ చేసిన కానిస్టేబుల్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# అంబర్ పేట ఫ్లైఓవర్ కింద అగ్ని ప్రమాదం



**అంబర్‌పేట, మార్చ్ 4 (నిఘా న్యూస్):** అంబర్‌పేట చే నంబర్ వద్ద ఫ్లైఓవర్ కింది భాగంలో నిర్మాణ సామగ్రి ఉంచిన ప్రదేశంలో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి కావడంతో క్రింది భాగంలోని నిర్మాణ సామాగ్రిని సిబ్బంది తరలిస్తున్నారు. వెల్డింగ్ చేసే క్రమంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. దట్టమైన పొగతో మంటలు ఎగిసి పడుతుండడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గుర య్యారు. దీంతో అంబర్ పేట, కాచిగూడ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకొని వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని నీళ్లను చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణా నష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేత

**ధర్మపురి, మార్చి 4(నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం దొంగతుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం దొంగతుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ క్లబ్ అధ్యక్షుడు దాడి సదయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కాల్వ రమేష్, ఉపాధ్యక్షులు ముత్యాల చంద్రశేఖర్, దాడి శ్రీనివాస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సంకరి ఓదేలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.



# నిలువఎగుమతులు లేకనే తగ్గిన మిర్చి ధర

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సదస్సులో శాస్త్రవేత్త శరత్ బాబు
- ఐక్య పోరాటాలకు సిద్ధం కండి : అఖిలపక్ష రైతు సంఘాల నేతలు



**ఖమ్మం, మార్చి 4(నిఘా న్యూస్):** వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ముఖ్యంగా మిర్చి ఎగుమతికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త బలేజిపల్లి శరత్ బాబు తెలిపారు. గతేడాది పండించిన మిర్చి పెద్ద మొత్తంలో నిల్వ ఉండడం ప్రపంచ వ్యాప్తంగా మిర్చి దిగుమతి చేసుకునే దేశాలలో వివిధ రకాల సంక్షోభాలు ఏర్పడడం కారణంగానే మిర్చి ధర గణనీయంగా పడిపోయిందని ఆయన విశ్లేషించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభను పురస్కరించుకుని మంగళవారం మిర్చి ధర పతనం పరిష్కార మార్గం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో శరత్ బాబు మాట్లాడుతూ భారతదేశంలో పండించిన వివిధ రకాల మిర్చిని పలు దేశాలు దిగుమతి చేసుకునేవి. ఈ ఏడాది దిగుమతుల విషయంలో ఆయా దేశాల స్థానిక పరిస్థితులు అన్నింటికి మించి అమెరికాలో ట్రంప్ తీసుకుంటున్న చర్యలు కారణమవుతున్నాయన్నారు. భారతదేశ ప్రధాని ట్రంప్‌తో సమావేశమైనప్పుడు ఎగుమతుల విషయంపై చొరవ చూపాల్సిందని శరత్ బాబు అభిప్రాయపడ్డారు. భారతదేశం దిగుమతి సుంకాన్ని పెంచిందన్న కారణంతో కొన్ని దేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయని ఆయన తెలిపారు. భారతదేశంలో పండించే కొన్ని మిర్చి రకాలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. ఈ ఏడాది తామరపురుగు, ఇతరత్రా కారణాలతో దిగుబడి గణనీయంగా తగ్గిందన్నారు. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ రంగ పరిరక్షణ బలమైన రైతాంగ ఉద్యమాలు సమిష్టి కార్యాచరణ అవసరమని శరత్ బాబు అభిప్రాయపడ్డారు. రైతులే ఎగుమతి చేసుకుంటే దళారీ వ్యవస్థతో ఇబ్బంది ఉండదన్నారు. ఎఫ్పివోలుగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మార్కెట్ను నిరంతరం అధ్యయనం చేయాలని, రైతులకు రైతు సంఘాల నేతలకు సూచించారు. దేశంలో వ్యవసాయ రంగ పరిశోధనలు అనుకున్న స్థాయిలో రైతులకు ఉపయోగపడడం లేదని దిగుబడులు, నాణ్యత పెంచే విషయంలో సరైన సూచనలు అందడం లేదన్నారు. వ్యవసాయానికి సంబంధించిన చట్టాలను సరైన రీతిలో గౌరవించడం లేదని శరత్ బాబు తెలిపారు. జీవ వైవిధ్య పంటలపై మరిన్ని పరిశోధనలు సాగాలని, ఆ పరిశోధనలు రైతాంగానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. మిర్చి పంటకు భవిష్యత్తు ఉందని ఎగుమతి అవకాశాలు తప్పక లభిస్తాయని శరత్ బాబు స్పష్టం చేశారు. వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర నిర్ణయం విషయంలో మరింత పురోగతి రావాలని కేంద్ర మంత్రి మిర్చి ధర రూ. 11781 కొనుగోలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు.

## ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఐక్య పోరాటాలతోనే వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతు సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. మోడీ సర్కార్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ వస్తున్నదని రైతుల గురించి పట్టించుకునే స్థితిలో లేదన్నారు. దేశంలోనే మిర్చి ఉత్పత్తిలో తెలంగాణ రెండవ స్థానంలో ఉందని ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. ఈ సదస్సులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు వేదికపైకి అతిథులను ఆహ్వానించగా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు గుర్రం అచ్చయ్య, మాజీ శాసన సభ్యురాలు బానోత్ చంద్రావతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్మశాన వాటికను సందర్శించిన ఎమ్మార్వో

**కబ్జాపై ఎమ్మార్వోకు వివరించిన న్యాయవాది శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ నేత రావుల సుధాకర్**



**అంబర్‌పేట, మార్చ్ 4 (నిఘా న్యూస్):** బాగ్ అంబర్ పేట్ డివిజన్ పాములబస్తీలోని హిందూ స్మశాన వాటిక స్థలం కబ్జాపై నిఘా దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి హైదరాబాద్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. స్మశానంలోని సమాధులపైనే ఇండ్ల నిర్మాణం అనే శీర్షికతో నిఘా తెలుగు జాతీయ దినపత్రికలో మంగళవారం వార్త కథనం ప్రచురితమైంది. ఈ వార్త కథనంపై స్పందించిన ఎమ్మార్వో వీరాభాయి, ఆర్ఐ బిక్షపతి, సర్వేయర్ కిరణ్ కుమార్‌లు మంగళవారం పాముల బస్తి స్మశాన వాటికను సందర్శించి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, న్యాయవాది దేవరుప్పుల శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ నాయకుడు రావుల సుధాకర్ ఎమ్మార్వోను కలిసి స్మశాన వాటిక స్థలం కబ్జాపై వివరించారు. ఈ స్మశాన వాటికను కబ్జా చేస్తున్నారని గతంలో జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, హైడ్రా కమీషనర్ కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. బహుజన వర్గాలకు సంబంధించిన హిందూ స్మశాన వాటికను కాపాడాలని, భవిష్యత్ తరాలకు తమ పూర్వీకుల ఆనవాళ్లు తెలిసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరారు. త్వరలో జిహెచ్ఎంసి కమిషనర్ ను కలిసి స్మశాన వాటిక పునరుద్ధరణకు చర్యలు తీసుకునే విధంగా భవిష్యత్ కార్యాచరణ చేస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మీడియాతో మాట్లాడుతూ ఈ స్మశాన వాటిక స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించి హద్దులను నిర్ధారించి జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కు లేఖ రాస్తామని తెలిపారు. స్మశాన వాటిక క్లీనింగ్, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ బాధ్యత జిహెచ్ఎంసి చూస్తుందని తెలిపారు.



ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డిని కలిసిన మల్లాపూర్ కురుమ సంఘం నాయకులు మంగళవారం కలిశారు. మల్లాపూర్ కురుమ సంఘం వ్యవస్థాపకులు బెల్లం గట్టయ్య కురుమ, ఉప్పల్ నియోజకవర్గ కురుమ సంఘం ప్రధానకార్యదర్శి చౌదరపల్లి పర్వతాలు కురుమ, సోహాల్ కుందన్ కలిసి ఘనంగా సత్కరించారు.

– మల్లాపూర్, మార్చి 4 (నిఘా న్యూస్):

# వంతెన నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే



**నాచారం, మార్చి 4 (నిఘా న్యూస్):** నాచారం డివిజన్ ప్రధాన రహదారి అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న నాచారం పెద్ద నాలాపై 94 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను కార్పోరేటర్ శాంతి, అధికారులతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు నాలాకి అడ్డగా ఉన్న మంచినీటి పైపు తొలగించాల్సిందిగా జలమండలి అధికారులకు తెలియచేసినా రావడం లేదని చెప్పడంతో, అప్పటికప్పుడు జలమండలి జిఎంతో మాట్లాడి తక్షణమే అడ్డుగా ఉన్న మంచినీటి పైపులైన్ తొలగించాలని ఎమ్మెల్యే సూచించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన నిర్మాణం నాణ్యతతో నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ నాగేందర్, డి ఈ బాలకృష్ణ, ఎఈ కీర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ ,జలమండలి మేనేజర్ సిరాజ్, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చింతకాని మండలంలో యధేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు

**డిఎంఅండ్ హెచ్ వోకు ఫిర్యాదు చేసిన మహిళా సంఘాలు**



**ఖమ్మం, మార్చి 4(నిఘా న్యూస్):** చింతకాని మండల పరిధిలోని కోదుమూరు గ్రామంలో లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడుతున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పివోడబ్ల్యూ మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కళావతి బాయికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నేతలు మాట్లాడుతూ, మనోజ్, చారి, కాత్యాయిని అనే వ్యక్తులు కాసులకు కక్కుర్తి పడి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని వారు ఆరోపించారు. వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పలువురు గర్భిణీలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడ శిశువైతే గర్భస్రావం చేస్తున్నారని వారు తెలిపారు. అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని వారిని కఠినంగా శిక్షించాలని దీని వెనక ఉన్న సూత్రదాలు, పాత్రధారులపై కేసులు నమోదు చేసి నిష్పాక్షపాతంగా విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంభిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని వారు తెలిపారు. ఇటువంటి లింగ నిర్ధారణ పరీక్షల కారణంగా భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, సిహెచ్ సీతామహాలక్ష్మి, సిహెచ్ శిరోమణి, ఎ. మంగతాయి, పి. ఝాన్సీ తదితరులు ఉన్నారు.

# అంగన్వాడీ పిల్లలకు అండగా నిలిచిన సాంబశివ



**పహాడీషరీఫ్, మార్చి 4(నిఘా న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ జల్పల్లి మున్సిపాలిటీ రాయల్ కాలనీలో అంగన్వాడీ స్కూల్‌కు 25 పలకలను పంపిణీ చేశారు. చిన్నారుల అవసరాలను గుర్తించి వారికి సాయం అందించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని అంగన్వాడి టీచర్ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు అలీ సిద్ధిఖీ పాల్గొన్నారు.

# నిరంతరం ప్రజల మధ్య మంత్రి పొన్నం

- ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత
- ఏ సమస్య ఉన్నా చెప్పండి, అంటూ భరోసా కల్పిస్తున్న వైనం



**సిద్దిపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** హుస్నాబాద్ నియోజకవర్గానికి శాసన సభ్యుడిగా గెలిచిన తరువాత మంత్రి పొన్నం ప్రభాకర్ తనదైన మార్కు చూపుతున్నారు. ఇప్పటికే ప్రతి మండలంలో అభివృద్ధి వేగంగా పరుగులు పెడుతుండగా అభివృద్ధి తో పాటు ప్రజా సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించారు. మరిన్ని సమస్యలపై పరిష్కారానికి మార్గాలు చూపుతూ తానున్నంటూ భరోసానిచ్చారు.

ప్రధానంగా సమస్యల్లో తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చదువుకున్న యువకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్య వైద్యం, ఉపాధి కల్పన, సాగునీరు అందించడమే తమ ప్రథమ కర్తవ్యంగా ముందుకు పోతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి నేడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. ఇప్పటికే గతంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళా ద్వారా ఐదు వేల మంది నిరుద్యోగ యువత కు ఉపాధి కల్పించారు. దాంతో పాటు వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ చూపారు. వేసవి కాలం ప్రారంభమైందని గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అటు అధికారులకు ఇటు గ్రామశాఖ అధ్యక్షులకు సూచించారు.

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ వేగంగా జరుగుతుందని త్వరలోనే ఈ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని ఇల్లు లేని వారికే మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఇప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని ఎన్నికల కోడ్ అయిపోయిన తరవాత కొత్త రేషన్ కార్డులు వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే భూమి లేని ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల అయ్యాయని ఎవరికైనా భూమిలేని ఉపాధి కూలీలకు డబ్బులు జమ కాకపోతే తెలిపాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం ఎవరెంతో వారికంత న్యాయం చేయడానికి కుల గణన చేశామని, ఈనెల 6 న జరిగే కేబినెట్ లో 42 శాతం రిజర్వేషన్ ల చట్టబద్ధత పై కేబినెట్ ఆమోదం తీసుకుంటామని తెలిపారు.

# వేసవి దృష్ట్యా చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి



**బాలాపూర్, మార్చ్ 4 (నిఘా న్యూస్):** వేసవి కాలం ఎండల తీవ్రత పెరుగుతున్నందున కార్పొరేషన్ ఆధ్వర్యంలో బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని చౌరస్తాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ పీ సరస్వతికి బిజెపి నేతలు రామకృష్ణారెడ్డి, రామిడి వీర కర్ణ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడ కూడా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి తమ పనుల నిమిత్తం కార్పొరేషన్‌కు వచ్చే ప్రజలు గుర్తున్నారని అన్నారు. పెరుగుతున్న ఎండల కారణంగా ప్రజలు ప్రయాణికులకు తాగునీటికి అవసరం ఉంటుందని ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా సంచరించి ప్రధాన కూడళ్లలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు.



## పోలీస్ కన్వెన్షన్ సెంటర్ సందర్శించిన కలెక్టర్

**వివరాలు తెలిపిన జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ**

**సిద్దిపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** జిల్లా కలెక్టర్ మనుచౌదరి, పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఇరువురు కలసి పొన్నాల గ్రామ శివారు నూతనంగా నిర్మించిన పెట్రోల్ పంపును సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నూతన పెట్రోల్ పంపు నిర్మాణం జరిగిన తీరు గురించి కలెక్టర్ వివరించారు. త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. తదనంతరం పోలీస్ కన్వెన్షన్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ కన్వెన్షన్ సెంటర్ ఆహ్లాదకరంగా విశాలమైన ప్రదేశంలో నిర్మించడం జరిగింది. విశాలమైన పార్కింగ్ ఉందని అద్భుతంగా ఉందని కొనియాడారు. పోలీస్ కన్వెన్షన్ సెంటర్ వివరాలను పోలీస్ కమిషనర్, కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ విష్ణు ప్రసాద్, మరియు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్ బీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే

**హాజరైన ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్**



**మౌలాలి, మార్చి 4 (నిఘా న్యూస్):** మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ లు స్థానిక కార్పొరేటర్ జరిపోతుల ప్రభుదాస్‌లతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మీర్పేట్ హెచ్.పీ కాలనీ డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ వెనకాల పెండింగ్ లో ఉన్న బాక్స్ డ్రైన్ వర్క్ ను వారి దృష్టికి తీసుకురాగా ఆ ప్రాంతాన్ని సందర్శించి సానుకూలంగా స్పందించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ బాక్స్ డ్రెయిన్ వర్క్ ను రానున్న వర్షాకాలంలోపు పూర్తి చేసినట్లయితే కాలనీవాసులకు ఇబ్బందులకు గురికాకుండా ఉంటుందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి వివరాలు తెలుసుకున్న జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే కార్యచరణ చేపడుతామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్, ఈఈ నాగేందర్, డీ.ఈ. బాలకృష్ణ, ఏ.ఈ. లింగారవు, స్థానిక నాయకులు చారి, బాలయ్య గౌడ్, పూస రమేష్, నిసార్ అహ్మద్ గోరి తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యపై కమీషనర్‌కు వినతి పత్రం

**మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్**



**ఘట్‌కేసర్, మార్చి 4 (నిఘా న్యూస్):** ఘట్‌కేసర్‌లో నెలకొన్న నీటి సమస్యపై ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బ సాని యాదగిరి యాదవ్ మంగళవారం నాడు ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 9,10 వార్డులలో భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ ఉన్నప్పటికీ నూతన పైప్ లైన్ లేనందున నీటి సమస్య తీవ్రమైనట్లు వారు తెలిపారు. ఈ కాలనీలలో నూతన పైప్ లైన్ వేయాలని వారు కోరారు. అదేవిధంగా కాలనీలలో పార్కు స్థలాలలో బోర్లు వేసి సంపు ఏర్పాటు చేసి రానున్న వేసవి కాలంలో ప్రజలకు సకాలంలో నీటి సరఫరా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఈ డబ్ల్యూ ఎస్ కాలనీ అధ్యక్షుడు కేశవపట్నం ఆంజనేయులు, జనరల్ సెక్రెటరీ శశిధర్, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీర్ గిరికి ఘన సన్మానం



**రామంతపూర్, మార్చి 4 (నిఘా న్యూస్):** ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్, రిటైర్డ్ డి ఈ ఇంజనీర్ గిరిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఎంఎ జలీల్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జలీల్ పాషా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎనలేని పోరాటం చేశారని, ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ద్వారా అనాధాశ్రమాలకు అనాధలకు స్వచ్ఛంద సంస్థలకు అనేక సేవలందించడంతో పాటు ఆర్థిక సాయం అందజేసిన ఇంజనీర్ గిరిని మంగళవారం సన్మానించినట్లు చెప్పారు. ప్రేరణ స్వచ్ఛంద సంస్థ పారిశుధ్య కార్మికులకు, స్ట్రీట్ వెండర్ లకు అండగా నిలిచి వారికి అధికారులు ఉండి ఎలాంటి ఇబ్బందు కల్గకుండా చూశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెంచులు, మల్లేష్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 11 నుండి బావోజీ బ్రహ్మోత్సవాలు





**ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్ష**

**మద్దూర్, మార్చి 4 (నిఘా న్యూస్):** ఉమ్మడి మద్దూరు మండలంలోని నూతనంగా ఏర్పడిన కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లి లో వెలసిన శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) బ్రహ్మోత్సవాలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. వచ్చే నెల 11 నుంచి 14 వరకు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయ అవరణలో సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి వసతి కల్పించాలని, అలాగే మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయని, కొత్తగా ఎన్ని మరుగుదొడ్లను నిర్మిస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతర ప్రాంగణంలో పాత మరుగుదొడ్లు 40ఉన్నాయని, కొత్తగా గతేడాది మరో 40 మరుగు దొడ్లను నిర్మించినట్లు మిషన్ భగీరథ ఈఈ రంగారావు తెలిపారు. అయితే పాత, కొత్త మరుగుదొడ్లు అన్నింటికి నీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 11న ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని జాతర విధులలో పాల్గొనే అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు 8 నుంచి 10 లక్షల మంది భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే అవకాశం ఉందని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖ అధికారుల సమన్వయంతో అన్ని వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. శాఖల వారీగా ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అయితే సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలలో పోలీసు బందోబస్తు సరిగ్గా ఉండదని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. నారాయణపేట కోస్గి డిపోలతోపాటు మహబూబ్ నగర్, తాండూర్ డిపోల నుంచి కూడా ఆర్టీసీ బస్సులను నడిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో జరిగే బావోజి బ్రహ్మోత్సవాలు దేశంలోనే ఇంత ఘనంగా ఎక్కడా జరగవని, ఈ ఉత్సవాలను రాష్ట్ర ఉత్సవాలుగా గుర్తించేలా ప్రభుత్వానికి నివేదించాలని దేవాలయ కమిటీ సభ్యుడు కలెక్టర్ ను కోరారు.

2008లో 1.47 లక్షల ఆలయ నిధులు నారాయణపేట ఆర్డిఓ కార్యాలయంలో భూసేకరణ కోసం చెల్లించడం జరిగిందని, కానీ ఇంతవరకు రథోత్సవం జరిగే ప్రాంతంలో భూసేకరణ జరగలేదని ఇప్పుడైనా భూసేకరణ పై దృష్టి సారించాలని ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ ను కోరారు. దేవాదాయ శాఖ నుంచి ఆలయానికి రెగ్యులర్ ఈవోతో పాటు క్యాడర్ స్ట్రెంత్ కావాలని కోరారు. కాగా సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్ , కడ ప్రత్యేక అధికారి శ్రీ గురులోక్ మాసంద్ ప్రభు ను, కాళికా దేవిని ఆలయంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, ఆర్డీవో రామచంద్రనాయక్, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, జిల్లా వైద్యానికి శాఖ అధికారిని డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, మిషన్ భగీరథ డి ఈ రంగారావు, పి ఆర్ ఈ ఈ హిర్యా నాయక్, విద్యుత్ శాఖ ఎస్ ఈ, ఎక్సైజ్, దేవాదాయ శాఖ, పోలీసు, రెవెన్యూ, అగ్ని మాపక, ఇరిగేషన్, ఆర్టీసి, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూఎస్ తదితర శాఖల జిల్లా స్థాయి అధికారులతో పాటు కొత్త పల్లి తహసిల్దార్, మద్దూరు ఎస్. ఐ, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

## భారత సంస్కృతికి ప్రతిరూపం శ్రీమద్రామాయణం

**టీటీడీ ధర్మ ప్రచారకులు**

**డా. మల్లు వేంకటరెడ్డి**



**కర్నూలు, మార్చి 4 (నిఘా న్యూస్):** ఎన్ని తరాలు మారినా, యుగాలు మారినప్పటికీ శ్రీమద్రామాయణం భారతీయ సంస్కృతికి ప్రతిరూపంగానే ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, పగిడ్యాల మండలం, లక్ష్మాపురం గ్రామంలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాల ప్రారంభోత్సవ సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం ఎస్. భానోజీరావు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిరిగిరి సుజాత, ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర్ రెడ్డి, కొమారి ఆంజనేయులు, ఎల్. మద్దిలేటి గౌడ్, కె.వెంకటేశ్వర్లు, తూర్పాటి సామన్న, శరబన్న, ఎం.స్వామన్న, కాశయ్యా చారి, నరేంద్ర గౌడ్, తిరుపతయ్య, రాముడు గౌడ్, ఆదినారాయణ, లక్ష్యాగౌడ్, నారాయణ గౌడ్, గోవిందు, లక్ష్మరాముడుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలో నీటి సరఫరాను పెంచండి

- **డ్రైనేజీ పైప్ లైన్‌లను ఏర్పాటు చేయండి**
- **టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ కార్యదర్శి హుస్సేని ముజీబ్**



**గచ్చిబౌలి మార్చి 4 (నిఘా న్యూస్):** గచ్చిబౌలి టీఎన్జీవో ముచువల్లి ఎయిడెడ్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీలో వాటర్ ఫెసిలిటీ, నల్ల కనెక్షన్లు లో నీటి ప్రేషర్ పెంపు, నూతన డ్రైనేజీ పైపులైన్ల వ్యవస్థ ఏర్పాటు, అదనపు నీటి పైప్‌లు ఏర్పాటుపై టీఎన్జీవో నేతలు వాటర్ వర్క్స్ అధికారులను కలిశారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి, టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ కార్యదర్శి హుస్సేని ముజీబ్, టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ కస్తూరి వెంకటేశ్వర్లు, వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ ఖాదర్ నేతృత్వంలో కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి వినతి పత్రం సమర్పించారు. టీఎన్జీవో సంఘం విజ్ఞప్తి మేరకు ఎండి అశోక్ రెడ్డి, వెంటనే స్పందించి టీఎన్జీవో కాలనీ సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలా నూతన డ్రైనేజీ లైన్ ల ఏర్పాటు చేయించడం, నల్ల కనెక్షన్లు ద్వారా సరఫరా అవుతున్న నీటి ప్రెషర్ పెంపు కోసం చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. టీఎన్జీవో సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేసారు.

## మల్కా కొమురయ్య విజయం చరిత్రాత్మకం

**ఘట్కేసర్‌లో బిజెపి నేతల సంబరాలు**



**ఘట్‌కేసర్, మార్చ్ 4 (నిఘా న్యూస్):** మల్క కొమురయ్య విజయం చరిత్ర ఆత్మ కం మని బిజెపి ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి మల్కా కొమురయ్య విజయం సాధించిన సందర్భంగా ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలను నిర్వహించి టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్లకు, పట్టభద్రులకు బిజెపి ద్వారానే న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఉపాధ్యాయ యూనియన్లకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంపై ఎంతో విశ్వాసం ఉందని ఆ విశ్వాసంతోనే నేడు ఉపాధ్యాయులు మల్క కొమురయ్య కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి భారీగా ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల్లో కూడా బిజెపి బలపరిచిన అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మల్కా కొమురయ్యకు ఓటు వేసి గెలిపించిన ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ యువమోర్చా అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు పల్లె మధు, కోటేశ్వర్, కొమ్మిడి దామోదర్ రెడ్డి, పల్లె ఆంజనేయులు, నరసింహ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, మాధవి, కట్ట మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ యువమోర్చ ఉపాధ్యక్షులు అనిల్ గౌడ్, కోటేశ్వర్, శ్రీధర్, బూతు అధ్యక్షులు మమత శర్మ ,హర్ష, పవన్, తదితరులు పాల్గొన్నారు.



జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం వేముల గ్రామం సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేని వాహనాలను తనిఖీలు చేయడం జరిగింది. వాహనదారులు రోడ్డుపై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్ పెట్టుకోవాలని కోరారు. కోదండపురం పోలీస్ స్టేషన్ ఎస్సై మురళి వివరించారు.

– ఇటిక్యాల, మార్చి 4 (నిఘా న్యూస్):

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారికి జైలు శిక్ష


**కోహెడ ఎస్ఐ అభిలాష్**



**సిద్దిపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** కోహెడ పోలీస్ స్టేషన్ జైలు శిక్ష వ్యక్తుల వివరాలు బోనాల సురేష్ గ్రామం శనిగరం, గట్టు బాబు గ్రామం రామచంద్రాపూర్, చేప్యాల సంపత్ గ్రామం చెంచల్చెరువుపల్లి, కోహెడ ఎస్ఐ అభిలాష్ వివరాలు తెలిపారు. కాగా హుస్నాబాద్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.కృష్ణ తేజ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన ముగ్గురు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష, తొమ్మిది మందికి జరిమానా విధించారు.


## అనుమతి లేకుండా బోర్లు వేస్తే చర్యలు తప్పవు

**అంబర్‌పేట ఎమ్మార్వో వీరాబాయి**



**అంబర్‌పేట, మార్చ్ 4(నిఘా న్యూస్):** అంబర్ పేట మండల కార్యాలయం పరిధిలో అనుమతి లేకుండా బోర్లు వేస్తే చర్యలు తప్పవని ఎమ్మార్వో వీరా భాయి హెచ్చరించారు. మంగళవారం ఎమ్మార్వో మీడియాతో మాట్లాడుతూ కొందరు వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ రెవెన్యూ, జలమండలి అనుమతి తీసుకోకుండా ఆక్రమంగా బోర్లు వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. భవన యజమానులు తమ స్థలంలో బోర్లు వేసుకోవడానికి రెవెన్యూ, జలమండలి అనుమతి తప్పనిసరి అని ఎమ్మార్వో తెలిపారు. అయితే కొందరు ఆదివారం, సెలవు దినాల్లో అనుమతులు లేకుండా బోర్లు వేస్తున్నారని, ఈ విషయమై స్థానికులు తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే సిబ్బందిని అక్కడికి పంపించి బోర్లు వేయకుండా అడ్డుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా బోరు మోటర్ల యజమానులు కూడా రెవెన్యూ, జలమండలి నుండి అనుమతి పొందిన వారి స్థలంలో మాత్రమే బోర్లు వేయాలని ఎమ్మార్వో సూచించారు. లేనిపక్షంలో బోర్ మోటార్ల యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి



**సిద్దిపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏన్సాన్ పల్లి గ్రామ శివారులోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటి యజమానురాలు ఒక విటుడు, ఒక మహిళను పట్టుకున్న సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు. బల్లాల రాజు యశోద, తన ఇంటిలో వేరే ఆడవారిని తీసుకొని వచ్చి వ్యభిచారం చేయుచున్నదని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు సిబ్బంది వెళ్లి దాడి చేసి నిందితుడు విటుడు మోతే శేఖర్, ఓ మహిళను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 1,700 రూపాయలు, 3 కండోమ్స్, 3 సెల్ ఫోన్స్, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని వ్యభిచార గృహ నిర్వాహకురాలు, విటుడిని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో పట్టణాలలో గ్రామాలలో కానీ ఇతర ప్రదేశాలలో సంఘ వ్యతిరేక కార్యక్రమాలు, జూదం, పేకాట, వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారమున్న, ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా చేసిన, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన కలిగి ఉన్న చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటువంటి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667447, 8712667446, నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా




**విశాఖపట్నం, మార్చి 4 (నిఘా న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికులు మంగళవారం విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అలా కాని పక్షంలో కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కనీస వేతనం 35 వేలు చెల్లించాలని ఏఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ డిమాండ్ చేశారు



## శ్రీ మత్స్యగిరి దేవాలయానికి మైక్ సెట్ విరాళం

**వలిగొండ, మార్చి 4(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం శ్రీ పంచముఖ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి మైక్ సెట్ బహూకరణ చేశారు. మైకు సెట్టు ఇచ్చినందుకుగాను ఆలయ చైర్మన్ ఈవో చాలా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**వరంగల్, మార్చి 4 (నిఘా న్యూస్):** హనుమకొండ జిల్లా ప్రశాంత్ నగర్ లోని సహృదయ వృద్ధాశ్రమం నందు వృద్ధులతో కలిసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్న వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అనంతరం వృద్ధులకు అన్నం వడ్డించి పండ్లు పంపిణీ చేసి వృద్ధాప్యంలో ఉన్న వృద్ధుల మధ్యలో పుట్టినరోజు వేడుకలు చేసుకోవడం తన తల్లిదండ్రుల మధ్యలో చేసుకున్నట్లు ఆనందం వ్యక్తపరిచినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన తల్లిదండ్రులు ఉన్నప్పుడు ఏరకంగా అయితే ప్రతి సంవత్సరం వారి మధ్యలో పుట్టినరోజు వేడుకలు చేసుకోవడం ఎలాగైతే అనిపించిందో, ఈరోజు వారు లేని లోటును ఈ వృద్ధాశ్రమంలో పుట్టినరోజు చేసుకోవడం నా తల్లిదండ్రులు ఉనట్లుగా వారి మధ్యలో చేసుకున్నట్లు అనుభూతి ఏర్పడినట్లు సంతోషం వ్యక్తం చేస్తూ తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని నిర్వాహకులకు తెలియజేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో పెళ్లిరోజు వేడుకలు జరుపుకుంటున్న వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఎమ్మెల్యే నాగరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోత్కూరులో.. పిఆర్టియు విజయోత్సవ సంబరాలు




**మోత్కూరు, మార్చి 4 (నిఘా న్యూస్):** వరంగల్,ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం లో పిఆర్టియు అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డి గెలుపొందిన సందర్భంగా మంగళవారం మోత్కూరు అంబేద్కర్ చౌరస్తాలో పిఆర్టియు టీఎస్ సభ్యులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తీపి రెడ్డి గోపాల్ రెడ్డి,ధర్మారపు వెంకటయ్య,ఇండ్ల రాంప్రసాద్, ఎదుల్ల సుధీర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె వెంకటేశ్వర్లు,పసునూరు సుధాకర్,మహిళా ఉపాధ్యక్షురాలు మర్రి జయ, అసోసియేట్ అధ్యక్షులు కడారు నర్సయ్య,మండల జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శుభలేఖలు పంచేందుకు వెళ్తూ ప్రమాదంలో తండ్రి మృతి



**వలిగొండ, మార్చి 4(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అరూర్ గ్రామం వలిగొండ శుభలేఖలు కొడుకు పెళ్లి శుభలేఖలు ఇచ్చేందుకు వెళ్లి తండ్రి మృత్యువాత పడ్డ సంఘటన మంగళవారం జరిగింది. ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం అరూరుకు చెందిన బోగారం వెంకయ్య తన బంధువు రాందాస్ తో కలిసి గొల్నేపల్లిలో శుభలేఖలు పంచేందుకు వెళ్లారు. నాగారం దుర్గమ్మ గుడి వద్ద టిప్పర్ ఢీ కొట్టడంతో వెంకయ్య మృతి చెందగా, రాందాస్ కు గాయాలు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### ఎస్సీ ఎస్టీ సంక్షేమానికి....

# భారీగా నిధులు కేటాయించడంపై హర్షం

**జిల్లా టిడిపి ఎస్సీ సెల్ కార్యదర్శి ధారా యేసురత్నం**



**జగ్గంపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** విజన్ ఉన్న నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ జన రంజకమైందని జగ్గంపేట నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు ,కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి, రత్నం ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దారా యేసురత్నం పేర్కొన్నారు. మంగళవారం గండేపల్లి మండలం మురారిలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడేలా రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, కొణిదల పవన్ కళ్యాణ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లు శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీలకు ప్రాధాన్యతిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ కు జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి 20,281 కోట్లు ఎస్సీల సంక్షేమానికి కేటాయించడంపై ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీలను పూర్తిగా నిర్వీర్యం చేసిదని విమర్శించారు. ఎన్డీఏ కూటమి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు అభివృద్ధి సంక్షేమానికి కోట్లు రూపాయలు కేటాయించడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ లందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి భారీగా నిధులు కేటాయించడం విశేషమని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 2025-26 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా తల్లికి వందనం పథకం కింద బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.9,407 కోట్లు కేటాయించిందన్నారు. చదువుకునే విద్యార్థులకు ప్రతి ఏటా రూ. 15 వేలను ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందించనుందని తెలిపారు. ఒక్క ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నా అందరికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తించనుందన్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమలు చేయనున్నారని, ఒకటి నుంచి 12 తరగతుల వరకు చదివే విద్యార్థులు మాత్రమే ఈ పథకం కింద అర్హులని సూచించారు. విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో ఈ డబ్బును జమ అవుతోందన్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం జూన్ లో ప్రారంభం కానున్నప్పటికి మే నెలలోనే విద్యార్థుల తలల ఖాతాల్లోకి తల్లికి వదనం సొమ్ము జమ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కాగా అమ్మఒడి పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేసిన వైకాపా తల్లికి వదనం పథకం పట్ల దుష్ప్రచారం చేస్తోందని, ఆ దుష్ప్రచారాన్ని నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు.

# వైభవంగా ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం

**స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన వాకిటి దంపతులు**



**వలిగొండ, మార్చి 4(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ముద్దాపురం గ్రామంలో గల శ్రీ ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య అంగరంగ వైభవంగా జరిగింది పండితుల ఆశీర్వచనాలు సన్నాయి వాయిద్యాల నడుమ అర్చక బృందం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు మీడియాతో మాట్లాడుతూ కలియుగంలో ప్రతి మానవుడు ఎలాంటి పూజా కార్యక్రమాలు చేసి భగవంతుని నామ స్మరణంతో చేయాలని కోరారు. కళ్యాణోత్సవానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి శ్రీ మత్స్యగిరిగుట్ట ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవ విగ్రహాలకు ఆలయ కమిటీ చైర్మన్ వాకిటి కొండల్ రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు గోవింద నామ స్మరణతో ఆలయం మార్మోగింది, అనంతరం కొడితాల అలివేలు అశోక్ గుప్తా దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ఏర్పాటు చేసినారు, గ్రామ యువకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సామ రాంరెడ్డి, పులిపలుపుల రాములు గౌడ్ ఆలయ కమిటీ వైస్ చైర్మన్ సామ నర్సిరెడ్డి ధర్మకర్తలు వాకిటి గంగిరెడ్డి వాకిటి శ్రీనివాస్ రెడ్డి వాకిటి వెంకట్ రెడ్డి గుంటోజు యాదాచారి సామ నవీన్ రెడ్డి పిన్నింటి ధర్మారెడ్డి మాద సోమయ్య గౌడ్ ఆవుల అనిల్ యాదవ్ మీసాల కృష్ణ నాయకులు పులిపల్పుల రాములు గౌడ్ నరసింహ గ్రామ ప్రజలు యువకులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో స్టేట్ ఫస్ట్ సాధించిన దాసం సామ్యూల్



**జగ్గంపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ అందుకున్న జగ్గంపేట గ్రామానికి చెందిన దాసం శామ్యూల్ రాజు ను స్థానిక శ్రీ కాంప్లెక్స్ ఆవరణలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) ఈ సందర్భంగా దాసం శామ్యూల్ రాజు మాట్లాడుతూ విశాఖపట్నం గాజువాక పవర్ జిమ్ లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ 150 కేజీల విభాగంలో మొదటి బహుమతి సాధించి గోల్డ్ మెడల్ అందుకున్నానని, బెంచ్ ఫ్రెష్ వెయిట్ లిఫ్టింగ్ లో 60 కేజీల విభాగంలో రెండవ స్థానం సాధించి సిల్వర్ మెడల్ అందుకున్నారని జగ్గంపేట హనుమాన్ పవర్ జిమ్ లో శిక్ష తీసుకున్నానని నాకు మా గురువు కన్నారావు మంచి శిక్షణ మంచి నేర్పరతనం నేర్పించి బహుమతులు అందుకునే విధంగా శిక్షణ ఇచ్చారని అన్నారు. నన్ను గుర్తించి సన్మానం నిర్వహించిన కొండబాబుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, తిరుమలాయపాలెం మాజీ సర్పంచ్ మతంశెట్టి సాయిబాబా, విజయ మల్టీమీడియా అధినేత రాజేష్, కోలా సతీష్, గంగాధర్ , సంజు, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ల అక్రమ అరెస్టులు

**అక్రమ అరెస్టులను ఖండించిన ఏఐటియుసి**



**మేడిపల్లి, మార్చి 4 (నిఘా న్యూస్):** రాష్ట్రంలో ఇంటలిజెన్స్ వ్యవస్థ పూర్తిగా సరైన సమాచారం లేకుండా ఏఐటియుసికి చెందిన అంగన్‌వాడీ టీచర్లను, నాయకులను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అర్ధరాత్రి నుండి అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లలో అక్రమంగా బంధించడాన్ని ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి ఖండించారు. రాష్ట్రంలోని పోలీసులు ముందస్తు నోటీసు సమాచారం ఇవ్వకుండా అంగన్‌వాడీ టీచర్ల ఇండ్లపై పోలీసు వాహనాలతో వచ్చి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో బంధించడం సబబు కాదన్నారు. పోలీస్ స్టేషన్‌లలో పెట్టి సాయంత్రం 4 గంటల వరకు వదిలేది లేదని పోలీసులు తెలిపారన్నారు. అక్రమ అరెస్టుల గురించి తెలిసి ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఇంటలిజెన్స్ అధికారులను సంప్రదించగా అరెస్టు చేయడానికి గల కారణాలు మాకు తెలియదని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. తప్పుడు పద్ధతులో అరెస్టు చేసి పోలీసులు నిర్బంధించటం మానవ హక్కులకు వ్యతిరేకమని వారన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు ఎవరికైనా ఉందని కానీ ఏఐటియుసి ఏలాంటి నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇవ్వకున్నా పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి వేధింపులకు గురిచేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా జరుగుతున్న అక్రమ అరెస్టులను ఆపాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరిగితే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరిక చేశారు. అరెస్టు అయిన వారిలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర కోశాధికారి ప్యారీజాన్‌తో పాటు కవిత, ఉమాదేవి, సులోచన, రమ, సుశీల, సుచిత్ర, శోభ, రమాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటిసి జిల్లా డిప్యూటీ సెక్రటరీ దండు రమేష్ అరెస్ట్ అయిన వారిని విడిపించడం జరిగినది.




## ఆదర్శలో క్యాంపస్ సెలక్షన్స్

**గోకవరం, మార్చి 4 (నిఘా న్యూస్):** కొత్తపల్లి ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ బి ఫాం నాలుగో సంవత్సరం చదువుతున్న,డి ఫార్మసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులకు సినర్జీ ఫార్మాసిటికల్ కంపెనీ ఇంటర్వ్యూస్ జరిగినవని ప్రిన్సిపల్ సుజని తెలియజేశారు. ఈ ప్రాంగణ ఎంపికలు సినర్జీ పరిశ్రమ నుంచి ఆర్ ఎండి హెడ్ చరణ్ ఆధ్వర్యంలో హెచ్ ఆర్ లు రవితేజ, నవీన్ లు విద్యార్థినీ విద్యార్థులను ఇంటర్వ్యూ చేయడం జరిగిందని ఈ ప్రాంగణ ఎంపికలో ఆదర్శ విద్యార్థులు 19 మందిని ఎంపిక చేయడం జరిగిందని వీరికి సంవత్సరానికి 2,34,848 రూపాయల వేతనంతో ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాధరావు తెలియచేశారు. ఎంపికైన విద్యార్థులను ఆదర్శ చైర్మన్ కనకరాజు సెక్రటరీ నాగమణి డైరెక్టర్స్ హారిక ప్రవల్లిక కోఆర్డినేటర్ శ్రీనివాస్ అధ్యాపకులు కామేష్ ప్రేమ్ సంకీర్తన భార్గవి వలస రెడ్డి పవన్ ప్రీతి దీప్తి, దీపిక అలేఖ్య తదితరులు అభినందించారు.

## భయపడితే అపజయాలు తప్పదు

**విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్న ప్రియదర్శిని మేడి**



**వలిగొండ, మార్చి 4(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను పొందాలని రిషారియా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియదర్శిని మేడి ఇంటర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరీక్షలు రాసే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం పరీక్షలు అంటే భయపడవలసిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు పరీక్షల పేరుతో తమ పిల్లలపై ఒత్తిడి తేవద్దని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. సమయపాలన పాటిస్తూ, ఆందోళనకు గురి కాకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులు చదవాలని ఆమె కోరారు.

## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**వరంగల్, మార్చి 4 (నిఘా న్యూస్):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం నుండి ఈ నెల 25వ తేది వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్షలు నిర్వహించే పరీక్షా కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలో163 బి ఎన్ ఎన్ ఎస్ చట్టం అమలు అవుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనుసరించి రేపటి గుంపులు ఉండడం ర్యాలీలు సభలు ధర్నాలు సమావేశాలు నిర్వహించడం ఊరేగింపులు చేయడం నిషేధించబడ్డాయి. అలాగే పరీక్ష సమయాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని ఎవరైనా ఈ ఉత్తర్వులు అతిక్రమించినచో వారిపై చట్టం చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మేడిపల్లి, మార్చి 4 (నిఘా న్యూస్):** వేసవి కార్యాచరణ ప్రణాళిక పనుల నేపథ్యంలో నేటి బుధవారం చెంగిచెర్ల ఎస్ఎస్ నుండి వెలువడే 11 కె.వి ఆర్టీసీ కాలనీలో మధ్యాహ్నం 2.గంటల నుండి సాయంత్రం 4 గంటల ప్రభావిత ప్రాంతాలైన గణేష్‌నగర్, ఇందిరానగర్, బృందావన్ కాలనీ, సుశీల టౌన్ షిప్, హరిప్రియ కాలనీ, శివశక్తినగర్, సాయినగర్, మాతారవింద కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. 33/1 కె.వి చెంగిచెర్ల ఎస్ఎస్ నుండి వెలువడే11 కె.వి మై విల్లాస్ ఫీడర్ సాయంత్రం 4 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కాకతీయ కాలనీ, జయశ్రీ కాలనీ, కమలానగర్, చిన్నక్రాంతి కాలనీ, అరవింద ఎన్‌క్లేవ్, యాదయ్యనగర్, రామకృష్ణనగర్, మై విల్లాస్ మొదలైన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని మేడిపల్లి సెక్షన్ ఏఈ హరినాథ్ సగ్గ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, వ్యాపారస్తులు తమ సిబ్బందితో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.





కూటమి ప్రభుత్వంపై తమ ప్రజలు గుంటూరు కృష్ణ జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 82 వేల 320 ఓట్లు భారీ మెజారిటీతో గెలిచిన కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపుకు కృషి చేసిన మండల కూటమి నాయకులకు పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపిన మండల బీసీల అధ్యక్షులు గుంజ గంగారావు.

– బెల్లంకొండ, మార్చి 4 (నిఘా న్యూస్):

# బోనకల్ పిహెచ్‌సి ని 50పడకల ఆసుపత్రికి పెంచాలి

### సిపిఐ మండల కార్యదర్శి ఆనందరావు

**బోనకల్, మార్చి 4(నిఘా న్యూస్):** బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రి గా ప్రకటించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం సిపిఐ మండల కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ,మధిర నియోజకవర్గంలోని ముదిగొండ,ఎర్రుపాలెం మండల కేంద్రాల్లో 50 పడకల ఆసుపత్రులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని అన్నారు. ఒక్కో ఆసుపత్రి నిర్మాణానికి 22 కోట్ల రూపాయల ఖర్చు చేయనున్నట్లు తెలుస్తోందని అన్నారు.ముదిగొండ నుంచి ఖమ్మంకు కేవలం 10 కిలోమీటర్లు మాత్రమే ఉందని, పైగా ఖమ్మం ప్రధాన ఆసుపత్రి కూడా సమీప దూరంలో ఉందని తెలిపారు. ఎర్రుపాలెం నుంచి మధిరకు కేవలం 18 కిలోమీటర్లు ఉందని, పైగా మధిరలో 100 పడకల ఆసుపత్రితో పాటు పలు రకాల ప్రైవేటు ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయన్నారు. బోనకల్ నుంచి ఖమ్మంకు 30 కిలోమీటర్ల పైగా ఉందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే వైద్యసేవనందిస్తుందన్నారు.అలాగే మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ, సాంఘిక సంక్షేమ,మహాత్మ జ్యోతిరావు పూలే తదితర గురుకులాల వందలాది విద్యార్థిని,విద్యార్థులు, రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు, శాంతి నిలయం మానసిక వికలాంగులు,దివ్య దయాల్ వృద్దులు తదితర వర్గాల వారు మండల కేంద్రంలోనే ఉంటున్నారని అన్నారు.రాత్రిళ్ళు అనారోగ్యం గురి అయ్యేటువంటి వారికి మండల కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రి వైద్య సేవలు అందించేవారు కూడా లేకపోవడంతో మండల ప్రజలు మరింత భయాందోళ గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు గురుకులాల్లో విద్య అభ్యసించేటువంటి విద్యార్థిని, విద్యార్థులు రాత్రిళ్ళు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు వైద్యం చేయించేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది నానా తంటాలు పడుతూ మానసికంగా ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా వామపక్ష పార్టీల నాయకులు 50 పడకల ఆసుపత్రి కోసం పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు జక్కుల రామారావు,ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.



# కీసరగుట్ట జాతర కానుకల లెక్కింపు



**కీసర, మార్చి 4 (నిఘా న్యూస్):** మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్టలో జరిగే జాతరకు ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున భక్తుల రద్దీ పెరుగుతుందని అందుకు భారీ మొత్తంలో ప్రతి సంవత్సరం కానుకలు పెద్ద ఎత్తున వస్తున్నాయని చైర్మన్ తటాకం నారాయణ శర్మ అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ తటాకం నారాయణ శర్మ మాట్లాడుతూ కీసరగుట్ట జాతరకు మహాశివరాత్రి సందర్భంగా జరిగే ఉత్సవాలకు దేశం నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారని ఆయన అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాలకమండలి చూసుకుందని తెలిపారు. జాతరకు వచ్చిన భక్తులు వేసినటువంటి ఉండిలో కానుకలు గత సంవత్సరం 27.13 లక్షలు రాగ, ప్రస్తుత సంవత్సరం 28.98 లక్షలు వచ్చాయని, గత సంవత్సరం కంటే 1 లక్ష 85 వేల రూపాయలు ఎక్కువగా వచ్చాయని ఆయన తెలిపారు. గత సంవత్సరం కంటే అభిషేకముకు, ప్రసాదములకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈ లెక్కింపునకు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని లెక్కింపును విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. గత సంవత్సరంలో మొత్తం 77.79 లక్షలు రాగ ప్రస్తుత సంవత్సరము మొత్తం 92.49 లక్షలు వచ్చాయని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఏర్పాట్లు భారీ ఎత్తున చేశామని, మా పాలకమండలి సభ్యులందరి సహకారంతో జాతరను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి ధర్మకర్తలు, దేవాదాయ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధికి జిల్లాలో మెరుగైన వైద్య సేవలు

### జిల్లా క్షయ వ్యాధి అధికారి డా. రవీందర్ యాదవ్



వికారాబాద్, మార్చి 4 (నిఘా న్యూస్): జిల్లా క్షయ వ్యాధి వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్ అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ, జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలోని గ్రామాలకు పర్యటిస్తూ ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రుల డాక్టర్లతో, వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించి, క్షయ వ్యాధి నివారణకు అనుసరించి అవగాహన కల్పిస్తున్నారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ప్రత్యేక వైద్య పరికరాలతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయినవారికి నాణ్యమైన ఔషధాలు అందించి క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి క్షయ వ్యాధిగ్రస్తులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంలో సఫలీకృతం అవుతున్నారు. ఇటు జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారిగా, ఇతరత్రా ఆరోగ్య ప్రోగ్రాం అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ, జిల్లా క్షయ వ్యాధి వైద్య ఆరోగ్య అధికారిగా సైతం బాధ్యతలు నిర్వహించి ఉన్నత ఫలితాలను సాధించడం గర్వించదగ్గ విషయమని, జిల్లా పరిధిలోని ప్రజలు వారి సేవలను కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 2024వ సంవత్సరంలో 22 వేల మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అందులో 1964 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. వారందరికీ ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రులలో మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. 1964 మందిలో 1564 మంది పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారని వెల్లడించారు. ఇంకా 400 మంది వైద్య సేవలు పొందుతున్నారని గణాంకాలతో సహా వివరించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయినవారికి ఒక్కొక్కరికి నెలకు 600 చొప్పున ఆరు నెలల పాటు నేరుగా క్షయ వ్యాధిగ్రస్తుల బ్యాంక్ ఖాతాలో రూపాయలు జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఇట్టి రూపాయలు రోగి పోషక విలువలు కలిగిన ఆహారం తినడానికి ప్రభుత్వం సదుద్దేశంతో అందజేస్తుందని పేర్కొన్నారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# నిర్మాణ పనుల్లో డస్ట్ వాడకం

### మున్నాళ్ల ముచ్చటగా డ్రైనేజీ నిర్మాణాలు
### మామూళ్లకు అలవాటుపడ్డ అధికారులు




**అనంతగిరి, మార్చి 4 (నిఘా న్యూస్):** మండల పరిధిలోని పాత గొల్ తండా గ్రామంలో కొత్త డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నారు ఈ క్రమంలో డ్రైనేజీలకు కంకర డస్ట్‌తో మాత్రమే వాడుతున్నారు. ఇసుకను పూర్తిగా వాడటం లేదు. ఇలా చేయడం వల్ల డ్రైనేజీ పాడయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ నిధులు కూడా వృధా అవుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యంపై పలువురు అనుమానం వ్యక్తపరిచారు. డ్రైనేజీలకు ఇసుక లేకపోవడం వల్ల పూర్తిగా ధ్వంసం కావడం జరుగుతుంది. కానీ కాంట్రాక్టర్లు జేబులు నింపుకోవడం కోసం ఇలా చేయడం దురదృష్టకరమని ప్రజలు వాపోతున్నారు.

# రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాదం



**శామీర్‌పేట, మార్చి 4 (నిఘా న్యూస్):** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా అలాగే శామీర్ పేట గ్రామానికి చెందిన శావర్తి గణేష్ వారి కుటుంబ సభ్యులు 50 కేజీల బియ్యం అందజేశారు. శామీర్ పేట గ్రామానికి చెందిన బండి బాలరాజు గౌడ్ – మహేశ్వరి దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# కార్పొరేట్ పాఠశాలల ముందస్తు అడ్మిషన్లపై చర్యలకు డిమాండ్



**మోత్కూరు, మార్చి 4 (నిఘా న్యూస్):** మోత్కూరు మండల కేంద్రంలోని శ్రీ చైతన్య కార్పొరేట్,ఇతర ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్ర విద్యా శాఖ నిబంధనలను విరుద్ధంగా పాఠశాలకు సంబంధించిన పిఆర్వోలతో ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నాయని,ఈ విద్యా సంవత్సరం పూర్తికాక ముందే ఎస్ఎస్‌సి పరీక్షలు జరగక ముందే తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి విద్యార్థుల్ని అడ్మిషన్ల కోసం బలవంతం పెడుతున్నారని, ఈ వ్యవహారాన్ని అరికట్టాలని నిబంధనలను పాటించకుండా వ్యవహరిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో మోత్కూరు మండల విద్యాధికారి టి.గోపాల్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల దోపిడీ రోజు రోజుకు పెరిగిపోతుందని, పది పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు వసంత పంచమి,అక్షరాభ్యాసం కార్పొరేట్ శ్రీ చైతన్య వార్షికోత్సవమని పేర్లతో డొనేషన్లు వసూలు చేసి పేద విద్యార్థుల తల్లిదండ్రుల రక్తం తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్పొరేట్ శ్రీ చైతన్య,ఇతర ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడికి అడ్డుకట్ట వేయాలన్నారు. లేనిచో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆయనతోపాటు జిల్లా నాయకులు చందు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలుకలను నివారించి పంటలను కాపాడుకోవాలి



**బెల్లంకొండ, మార్చి 4 (నిఘా న్యూస్):** మండలంలోని చంద్రాజుపాలెం కందిపాడు గ్రామాలలో రబి వరి సాగు చేయు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం జరిగినది. కిలోగ్రాము విషపు ఎర తయారీ కి 960 గ్రాముల వరి నూకలు 20 గ్రాములు బ్రోమోడయలోన్ 0.25శాతం, 20 గ్రాములు నూనె వినియోగించి విషపు ఎర తయారీ ప్రయోగాత్మకంగా తయారు చేసి రైతులకు పంచడం జరిగింది.ఒక్కొక్క జీవ ఎలుక బోరియ కు పదిగ్రాములు చొప్పున పొట్లం కట్టి బోరియలో వేసి మట్టితో బొరియను ముసివేయాలి. విషపు ఎర తినిన ఎలుక యాంటి క్యాగ్యులేషన్ చర్య వలన చనిపోతుందని, విషపు ఎర చిన్న పిల్లలకు, కోళ్లు పెంపుడు జంతువులకు అందుబాటులో ఉంచరాదని, సామూహికము గా నివారణ ద్వారా మాత్రమే సమర్ధవంతంగా ఎలుకలను నిర్మూలించు కో వచ్చని వ్యవసాయ అధికారి డి.క్రిష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ ఉద్యాన సహాయకులు, గ్రామ వ్యవసాయం సహాయ కులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు బోల్తా పడి పలువురికి గాయాలు



**కొలిమిగుండ్ల, మార్చి 4 (నిఘా న్యూస్):** కొలిమిగుండ్ల మండలంలోని కలవటాల గ్రామ సమీపంలో మంగళవారం జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 14 మందికి గాయాలు కాగా చికిత్స కోసం కొలిమిగుండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ వారిని మెరుగైన వైద్యం కోసం తాడిపత్రి అనంతపురం ఆస్పత్రులకు అంబులెన్స్ లో తరలించారు. బస్సు డ్రైవర్ సెల్ ఫోన్ లో మాట్లాడుతూ అతివేగంగా వెళ్లడం వల్లే బస్సు బోల్తా పడినట్లు గాయపడ్డ బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న కొలిమిగుండ్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# మల్క కొమురయ్య గెలుపుపై నేతల హర్షం



### స్వీట్లు పంచి బిజెపి నేతల సంబరాలు

**గన్నేరువరం, మార్చి 4 (నిఘా న్యూస్):** కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు పట్ల గన్నేరువరం మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం గుండ్లపల్లి స్టేజి వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నికేశ్ మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ దాకా బీజేపీ ప్రభంజనం కొనసాగుతుందన్నారు. ఎన్నికలు ఏవైనా ప్రజలు బీజేపీకి పట్టం గట్టి, ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారు అని పేర్కొన్నారు. తాజాగా వెలువడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమురయ్య గెలుపుతో ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని, మరోసారి నిరూపితమైందన్నారు. ఇదే ఒరవడి రాబోయే రోజుల్లో కొనసాగుతుందని నికేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీజేపీ పార్టీ మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### కరీంనగర్ తరలి వెళ్లిన నాయకులు..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమురయ్య భారీ మెజారిటీతో గెలుపొందిన నేపథ్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో గన్నేరువరం మండలం అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ అధ్యర్యంలో నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుంటుక శంకర్ విలాసాగరం రామచంద్రం, రాజిరెడ్డి, కొలుపుల మహేందర్, అనిల్ రెడ్డి, పంబాల రాజశేఖర్, రామచంద్రం, సురేందర్, గాద వెంకన్న, గట్టు కిషన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు టీకాలు

### సద్వినియోగం చేసు కోవాలని
### డిప్యూటీ డైరెక్టర్ రామారావు విజ్ఞప్తి



**బెల్లంకొండ, మార్చి 4 (నిఘా న్యూస్):** నరసరావుపేట జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్.రామారావు మండల కేంద్రంల మంగళవారం పశువులకు గాలికుంటు టీకాలు పశుగణన కార్యక్రమాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలు మార్చి1వ తారీకు నుండి 31వ తేదీ వరకు పశువులకు టీకాలు వేట జరుగుతుందని దీనిని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో బెల్లంకొండ పశు వైద్య డాక్టర్ జి.బాలకృష్ణ రెడ్డి, అరుణ, దేవయ్య, భార్గవ్, నాగార్జున ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు భారీ బందోబస్తు




**నారాయణపేటం, మార్చు 4 (నిఘా న్యూస్):** నేటి నుండి 22 వరకు జరగనున్న ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ అన్ని రకాల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలలో 8791 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాల వద్ద 163 బి.ఎన్.యస్.యస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, మరియు చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు, మూసి వేయాలని అన్నారు. పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 200 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని అన్నారు. పరీక్షలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ నందు పొందుపరిచిన విధంగా సమయానికి చేరుకోవాలని అన్నారు. అభ్యర్థులు తమవెంట పరీక్షా హాల్‌లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్, పెన్ డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, కాలిక్యులేటర్లు, వాలెట్లు,వంటివి తీసుకువెళ్లడానికి అనుమతి ఉండదని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందే ప్రధాన గేట్ వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసు వారికి సహకరించగలరని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఇన్చార్జితో మేడ్చల్ నేతల సమావేశం



**హైదరాబాద్, మార్చి 4 (నిఘా న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం తీసుకోవాల్సిన చర్యలపై తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. రాబోయే గ్రేటర్ ఎన్నికలు, ఉప్పల్ నియోజకవర్గంలో అమలవుతున్న కార్యక్రమాలు, పార్టీ పరంగా, ప్రభుత్వం అందతో చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. 10ఏండ్లు పార్టీ జెండా మోసిన వారిని గుర్తించి, పదవులు ఇవ్వటం, ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగాల్సిన పరిస్థితిని నటరాజన్ వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు అండతో ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీని ముందుకు తీసుకెళ్తామని హామీ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో మందముల పరమేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి ,పార్లమెంట్ ఇంచార్జి సునీత మహేందర్ రెడ్డి మాజీ మేయర్ బొంతు రాంమోహన్, తోటకూర జంగయ్య యాదవ్ చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ రాజేందర్ పాల్గొన్నారు.

# పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా

### ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం

**గుంటూరు,మార్చి4(నిఘా న్యూస్):** ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద ప్రసాద్ ఘన విజయం సాధించారు. మొత్తం తొమ్మిది రౌండ్లకు గానూ, మంగళవారం తెల్లవారుజామున 5:50 గంటల సమయంలో చివరి రౌండ్ పూర్తయ్యే సరికి ఆయనకు 82,320 ఓట్ల ఆధిక్యం వచ్చింది. 7వ రౌండ్ ముగిసే సరికి ఆయనకు 1,18,070 ఓట్లు వచ్చాయి. మొత్తం 2,41,873 ఓట్లు పోలవగా, ఏడో రౌండ్ పూర్తయ్యే సరికి 21,577 చెల్లని ఓట్లుగా గుర్తించారు. దీంతో 50 శాతానికి పైగా ఓట్లు సాధించడంతో ఆలపాటిని విజేతగా ప్రకటించారు. ఇక తొమ్మిదో రౌండ్ పూర్తయ్యే సరికి ఆలపాటికి 1,45,057 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి లక్ష్మణరావు 62,737 ఓట్లు సాధించారు. ఆలపాటి రాజాకి 82,320 ఓట్ల మెజార్టీ దక్కింది. చెల్లుబాటు అయిన ఓట్లలో 60శాతం పైగా ఓట్లను ఆలపాటి సాధించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున పోటీచేసిన గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. పోటాపోటీగా సాగిన ఎన్నికలో ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మీద ఆయన గెలుపొందారు. ఏయూలో జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చివరివరకు ఉత్కంఠగా సాగింది. ఈ ఎన్నికల్లో 10మంది బరిలో ఉన్నా.. పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీనివాసులునాయుడు, పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి, ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మ మధ్యే పోటీ నెలకొంది. నువ్వానేనా అన్నట్లు పోటీ సాగగా ఆఖరుకు రఘువర్మను ఎలిమినేట్ చేశారు. మొత్తం పోలైన ఓట్లు 20,791 అయితే చెల్లిన ఓట్లు 20,135. ఇందులో 10,068 ఓట్లతో మేజిక్ ఫిగర్ని అందుకోవాల్సి ఉండగా గాదెకు 12,035 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన గెలిచినట్లు ప్రకటించారు.

# ఈ నెలలోనే మెగా డిఎస్సీ విడుదల

### మరోమారు స్పష్టం చేసిన మంత్రి లోకేశ్

**అమరావతి,మార్చి4(నిఘా న్యూస్):** ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే భాధ్యత తమదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదని, 1.82 లక్షల పోస్టులు గత టీడీపీ హయాంలోనే భర్తీ చేశాం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో రెండోరోజు ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతిపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానాలు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. 1.82 లక్షల పోస్టులు గత టీడీపీ హయాంలోనే భర్తీ చేశాం. ఎట్టి పరిస్థితుల్లోను మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే భాధ్యత మాది. వాస్తవాలు తెలుసుకుని వైసీపీ సభ్యులు మాట్లాడాలి’ అని అన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని త్వరలోనే అమలు చేయనుందని, ఇందుకు సంబంధించిన గైడ్ లైన్స్ త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. తల్లికి వందనం పథకానికి బ్జడెట్లో రూ.9,407 కోట్లు కేటాయించినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. తల్లికి వందనం పథకంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.

# ఆలయంలో చోరీ కేసును చేదించిన పోలీసులు

### ఇద్దరు వ్యక్తులను అదుపులోకి రిమాండ్ కు తరలింపు

**అబ్దుల్లాపూర్‌మెట్, మార్చ్ 4(నిఘా న్యూస్):** అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధి పిగ్లీపూర్ గ్రామంలో వెలసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో వెండి వస్తువుల చోరీ కేసును అబ్దుల్లాపూరమేట్ పోలీసులు చేధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధి పిగ్లీపూర్ గ్రామంలో వెలసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వెండి వస్తువులు సుమారు 15 కిలోలు కనిపించలేదని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్టు ఆలయ పూజారి గత నెల ఫిబ్రవరి 27న ఇచ్చిన పిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా మంగళవారం ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఒక బైక్ పైన బ్యాగ్ పట్టుకొని వెళుతున్నారు. పోలీసులకు అనుమానం వచ్చి ఆ వ్యక్తులను తనిఖీ చేయగా వారి దగ్గర ఉన్న బ్యాగ్ లో బిస్కెట్స్ రూపంలో వెండి ఉండటంతో పోలీసులు వారిని ప్రశ్నించారు. వారు సరైన సమాధానం చెప్పకపోవటంతో పోలీస్ స్టేషన్ కి తీసుకొని వచ్చి వారిని విచారించగా మెదక్ జిల్లా, శివంపేట్ మండలం ,నవాబ్ పేట్ గ్రామానికి చెందిన మహమ్మద్ ఇంతయాజ్ ,షరీఫ్( 39), వృత్తి పెయింటర్ , అదే ప్రాంతానికి చెందిన రంగ వేణు ( 33), వృత్తి ఎలక్ట్రీషియన్ వీరిద్దరూ ఒకే గ్రామానికి చెందిన వ్యక్తులు చెడు వ్యసనాలకు, జల్సాలకు అలవాటు పడి ఎలాగైనా అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించడానికి దేవాలయాలలో దొంగతనాలు చేయటానికి నిర్ణయించుకొని గూగుల్ మ్యాప్ సహాయంతో గ్రామ శివారులో ఉన్న దేవాలయాలను ఎంచుకొని, గూగుల్ లో అప్ లోడ్ చేసిన ఫోటోలు, అక్కడ విగ్రహాలకు అలకరించిన ఆభరణాలు ఫోటోలు చూసి ఇద్దరు కలిసి రాత్రి సమయాలలో వచ్చి గుడి తాళాలు పగలకొట్టి గుడిలో ఉన్న వెండి ఆభరణాలు దొంగతనం చేస్తుంటారు. ఆ విధంగా అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పిగ్లీపూర్ గ్రామంలో వెలసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో కూడా ఈ వ్యక్తులే దొంగతనం చేసినట్లు నేరాన్ని అంగీకరించారు. ఇదే విధంగా ఘటకేసర్, దుండిగల్, బీబీ నగర్, ఇబ్రహీం పట్నం మరియు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా దొంగతనం చేసినట్లు నేరాన్ని ఒప్పుకున్నారు. వీరు దొంగతనం చేసిన ఆభరణాలను ముక్కలుగా చేసి కరిగించి వాటిని బిస్కెట్స్ రూపంలో తయారు చేయించి అమ్మడానికి విజయవాడ కి తీసుకొని పోతుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కి పంపించినట్లు అబ్దుల్లాపూర్ మెట్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అంజి రెడ్డి తెలిపినారు.





# మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ

### ఫీజులు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ




**మహేశ్వరం, మార్చి 4(నిఘా న్యూస్):** తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు ఫీజులు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వాణిరెడ్డి తెలిపారు. ఎల్ఆర్ ఎస్ చెల్లింపుపై సందేహాలు, సలహాల కోసం సహాయ కేంద్రం(హెల్ప్ డెస్క్)ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను లే ఔట్లను, ప్లాట్ లను క్రమబద్ధీకరించ డానికి 2020లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తును స్వీకరిం చామన్నారు. ఈ దరఖాస్తును ప్రభుత్వం గత కొద్ది రోజుల నుంచి క్రమబద్ధీకరిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ దరఖాస్తుల్లో ఉన్న ఫీజులో 25 రాయితీ లభిస్తుందన్నారు. మార్చి 31వరకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలు కోసం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సందర్శించి వివరాలను తెలుసు కోవాలని కోరారు.

# కొనసాగుతున్న యాగగిరీశుడి బ్రహ్మోత్సవాలు

**యాద్రాద్రిభువనగిరి,మార్చి4(నిఘా న్యూస్):** వటపత్రశాయిగా, రాత్రి హంస వాహన సేవలో లక్ష్మీ నరసింహ స్వామి మహాద్భుత దర్శనభాగ్యం భక్తులకు కలిగింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్స వాలు నాలుగు రోజులుగా ఏకకుండాత్మక, నావాహ్నిక, పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో జరుగుతున్నాయి. ప్రధా నాలయంలో మంగళవారం వేకువజామున ద్వారతోరణ పూజ, ధ్వజ కుంభారాధన, అగ్ని ఆరాధన, మూల మంత్ర, పంచసూక్త హవనం తదితర పూజలను ఆలయ ప్రధానార్చకులు, యాజ్ఞికులు, రుత్వికులు, పారాయణందారులు నిర్వహించారు. అనంతరం ఉదయం 8.00 గంటలకు స్వామివారిని వంటపత్ర శాయి అలంకారంలో ప్రత్యేక పల్లకిపై అధిష్టించారు. రుత్వికులు, వేదపండితులు స్వామివారి అలంకార సేవ ముందు దివ్య ప్రబంధ వేద పారాయణాలు, మూల మంత్ర జప పఠనాలు గావించారు. అనంతరం డోలు సన్నాయి, మేళాలతో స్వామివారిని ప్రధానాల మాఢ వీధుల్లో ఊరేగించారు. స్వామి వారిని తూర్పు మాఢవీధుల్లో ప్రత్యేక వేంచేపు మండ పంలో ఆస్థానం చేసి ప్రధానార్చకులు వటపత్రశాయి విశిష్టతను భక్తుల వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి, ఈఓ భాస్కరరావు, డీఈఓ దొర్భల భాస్కర్ శర్మ, ప్రధానర్చకులు నల్లన్ తీఘల్ లక్ష్మీనరసింహ చార్యులు, వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ మేరీస్ లో గ్రాడ్యుయేషన్ వేడుక




**శామీర్‌పేట, మార్చి 4 (నిఘా న్యూస్):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తుర్కపల్లిలోని సెయింట్ మేరీస్ సెంట్రల్ పాఠశాలలో ఈ మంగళవారం గ్రాడ్యుయేషన్ వేడుక ఘనంగా నిర్వహించ బడింది. విద్యార్థుల శ్రమను గౌరవిస్తూ, వారు తమ విద్యా జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనున్న సందర్భాన్ని పురస్కరించు కుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ ప్రత్యేక వేడుకకు ముఖ్యతిథిగా తిరుపతి రెడ్డి పాఠశాల కర స్పాండెంట్ వరప్రసాద్ రెడ్డి హాజరై, విద్యార్థు లకు ఉత్తేజభరితమైన సందేశాలు అందించారు. తిరుపతి రెడ్డి విద్యార్థులకు భవిష్యత్తులో తమ లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి శ్రమించాలి, పట్టుదలతో ముందుకు సాగాలి అనే విషయా లను వివరించారు. అలాగే, వరప్రసాద్ రెడ్డి మంచి విద్య మాత్రమే ఒక వ్యక్తి జీవితాన్ని మారుస్తుందని, క్రమశిక్షణ, సమయపాలన, నైపుణ్యాభివృద్ధి ఎంత ముఖ్యమో వివరించారు. ఈ వేడుకలో విద్యార్థులు తమ అనుభవాలను పంచుకొని, తమ భవిష్యత్తు ఆశయాలను వెల్ల డించారు. వారిని ప్రోత్సహిస్తూ పాఠశాల ఇంచార్జ్ గ్రేస్ రెడ్డి, గౌసియా పాల్గొని, తమ ప్రేరణాత్మక మాటలతో విద్యార్థులను ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమం విద్యార్థుల జీవితంలో చిరస్మరణీయమైన రోజుగా నిలిచింది.

### సర్వే పేరుతో... చేనేత కార్మికులకు

# అన్యాయం చేయొద్దు

- చేనేత పొదుపు పథకాన్ని వెంటనే ప్రారంభించాలి
- చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు



**మోత్కూరు, మార్చి 4 (నిఘా న్యూస్):** క్షేత్ర స్థాయి పరిశీలన పేరుతో అర్హులైన చేనేత కార్మికులకు అన్యాయం చెయ్యొద్దని,అర్హత కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆయన మంగళవారం మోత్కూర్‌లో మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి,చేనేతకు చేయుత, చేనేత భరోసా, చేనేత బీమా పథకాలను ప్రవేశపెట్టిందని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి మగ్గం కలిగిన ప్రతి చేనేత కార్మికునికి జియోట్యాగ్ నెంబర్ వేసి అమలు చేశారని, అవి చేనేత కార్మికులకు ఎంతగానో ఉపయోపడ్డాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం చేనేత కార్మికుల పోరాట ఫలితంగా ఆ పథకాలను పునఃప్రారభింస్తామని ప్రకటన చేసినప్పటికి, నేటికీ ప్రారంభించకుండా సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ, కార్మికులను అయోమయానికి గురిచేస్తుం దని విమర్శించ్చారు. ఇప్పటికే చేనేత శాఖ జిల్లా అధికారులు ఇంటింటికి తిరిగి జిల్లాలోని ప్రతి మగ్గాన్ని సర్వే చేశారని, కాని ప్రభుత్వం రీ సర్వే పేరుతో కాలయాపన చేస్తూ, అమలు చేయడంలో జాప్యం చేస్తుందని అన్నారు. చేనేత పొదుపు పథకాన్ని వెంటనే ప్రారంభించి అర్హత కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి అందేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కొమురయ్య గెలుపుతో బిజెపి సంబరాలు



**ముస్తాబాద్, మార్చి 4(నిఘా న్యూస్):** భారతీయ జనతా పార్టీ బలపరిచిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్య ఘనవిజయనం సాధించిన సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు అంజాగౌడ్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా సంబరాలు నిర్వహించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందనడానికి ఈ ఫలితాలు నిదర్శనమని అంజా గౌడ్ పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లకు విజయానికి కృషిచేసిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్ మండల ప్రధాన కార్యదర్శి బాద నరేష్, నాయకులు చీట్నేని శ్రీనివాసరావు, మహేందర్, గూడబాల్ రెడ్డి, ఎదునూరి గోపికృష్ణ, పప్పుల శ్రీకాంత్, సత్తయ్య, ఓరగంటి సత్యం, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, రఘుపతి ,పీరల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్ ఆఫ్ ది ఇయర్-25 గా ప్రొఫెసర్ సూర్య



**హైదరాబాద్, మార్చి 4 (నిఘా న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రముఖ సాహిత్యవేత్త, సీనియర్ ప్రొ.వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యకు ఈ ఏడాది రాష్ట్రం నుంచి ఒక్కరికే ఇచ్చే అవార్డు ‘ఉమెన్ ఆఫ్ ది ఇయర్–2025’ ఉత్తమ మహిళా పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అడ్జస్ట్రేషన్ ట్రిబ్యునల్ కోర్టు ఛైర్మన్ జస్టిస్ వామన్ రావు దేశ్పాండే, అమెరికా దేశ చికాగో స్టేట్, అమీర్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ చైర్మన్ ఫరూక్ అలీ ఖాన్, హైకోర్టు ప్రముఖ న్యాయవాది, ఇట్టా ఉదయశ్రీ తదితరులు పాల్గొని ఈనెల 7వ తేదీన యూనివర్సిటీలో ఈ అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు.

# బిసిల సంక్షేమంపై వైసిపి మొసలి కన్నీరు

### ఐదేళ్ల పాలనలో వారిని విస్మరించారు

### మండలిలో చర్చలో మంత్రులు లోకేశ్, సవితల ఆగ్రహం

**అమరావతి, మార్చి4 (నిఘా న్యూస్):** ఏపీ శాసనమండలిలో ప్రశ్నోత్తరాలపై చర్చ వాడి వేడిగా జరిగింది. బీసీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై వైసీపీ సభ్యుల ఆరోపణలకు ధీటుగా మంత్రులు నారా లోకేష్, సవిత సమాధానం చెప్పారు. బీసీలకు గత వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌ను ఎలా హత్య చేశారో చర్చించేందుకు సిద్ధమా? అని లోకేశ్ సవాల్ విసిరారు. బీసీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో లోకేశ్ మాట్లాడారు. ఎమ్మెల్సీ అనంతబాబు దళితుడిని చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేయలేదా?చేశారా? అనేది వైకాపా సభ్యుడు త్రిమూర్తులు చెప్పాలి. వైకాపా హయాంలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారో ఆ పార్టీ సభ్యులు చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ...నా బీసీలు అంటూ గొప్పలు చెప్పిన జగన్.. గత ఐదేళ్ల పాలనలో బీసీలకు ద్రోహం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లోనే రూ. 1,977 కోట్లు స్వయం ఉపాధి పథకాలకే కేటాయించాం. రూ.200 కోట్లతో 1.2 లక్షల మందికి ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తూ కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నాం. బీసీల కోసం కార్పొరేషన్ల ద్వారా రాయితీపై రుణాలు అందిస్తున్నాం. ఆదరణ పథకానికి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాం. 26 జిల్లాల్లో బీసీ భవన్‌లను నిర్మించబోతున్నాం అని మంత్రి తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాలు మరమ్మతులు చేస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరం విజయం

**ఏలూరు,మార్చి4(నిఘా న్యూస్):** ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఉభయగోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా టీడీపీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. పీడీఎఫ్ అభ్యర్థి వీర రాఘవులుపై పేరాబత్తుల గెలుపొందారు. ఇప్పటి వరకు జరిగిన ఏడు రౌండ్లలోనూ రాజశేఖరం ఆధిక్యంలో నిలిచారు. ఆయన మొత్తం లక్షా 12వేల 331ఓట్లు సాధించారు. అలాగే పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు 41,268 ఓట్లు వచ్చాయి. ఈ క్రమంలో వీర రాఘవులుపై పేరాబత్తుల రాజశేఖరం 71,063 ఓట్ల ఆధిక్యతలో నిలిచారు. విజయానికి కావాల్సిన పోలైన ఓట్లలో 50 శాతం మొదటి ప్రాధాన్యత ఓట్లను కూటమి అభ్యర్థి సాధించారు. మ్యాజిక్ ఫిగర్ దాటడంతో పేరాబత్తుల రాజశేఖరం విజయం ఖాయమైంది.

## 1167 కె జాతీయ రహదారి భూసేకరణ అధికారుల లీలలు

### రోడ్డు విస్తరణలో భూమి పోయిన రైతుకు కాకుండా సంభందం లేని మహిళకు భూమి పరిహారం



**నంద్యాల/కొత్తపల్లి, మార్చి 4 (నిఘా న్యూస్):** నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం గుమ్మడాపురం మజారా శింగరాజుపల్లె గ్రామానికి చెందిన మూగి వెంకట రమణారెడ్డి అను రైతుకు సంబందించిన సర్వే నెంబర్ 331 తరిభూమి ( మాగాని ) 0.13 సెంట్లు కల్వకుర్తి - నంద్యాల 167 %ఎవ% జాతీయ రహదారిలో భూమి పోయింది. ప్రభుత్వం రూ. 47,756 వేల పరిహారం చెల్లించేందుకు ఆవార్డు నోటీసు కూడా రైతుకు అందించింది. ప్రభుత్వం గత నెల జనవరి 31తేది నుంచి మొదటి విడతగా రైతులకు భూమి నష్ట పరిహారం వారి బ్యాంకు ఖాతాలోనే జమచేస్తుంది. రైతు రమణారెడ్డి నంద్యాల జిల్లా కలెక్టరేట్ లోని 167 కే భూసేకరణ కార్యాలయంకు వెళ్లి నా పొలం డబ్బులు రాలేదని సంబందించిన అధికారులను కోరగా రెండవ విడత నీకు నీ పొలం డబ్బులు జమ అవుతాయని చెప్పడంతో వెనుతిరిగారు. అయితే మంగళవారం శింగరాజుపల్లె గ్రామానికే చెందిన మారేడు ప్రమీలమ్మ భర్త యోహాను ప్రభుత్వం మీ పొలం డబ్బులు మా భార్య బ్యాంకు అకౌంట్ కు జమ చేశారు. మీ డబ్బులు మాకెందుకు మేము బ్యాంకు నుంచి తీసుకోచ్చామని చెప్పడంతో గ్రామస్థులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. పొలం డబ్బులు దళిత మహిళ అకౌంట్ కు వేయడమేంటి. ఆయన పొలం పక్కన కూడా ప్రమీలమ్మ పొలం లేదే సంబంధం లేని వారికీ భూమి పరిహారం డబ్బులు ఎలా బ్యాంకు అకౌంట్ కు జమచేస్తారు, వారు బ్యాంకు నుంచి విడుదల చేసుకొని భాదిత రైతుకు నేరుగా ఎలా ఇస్తారని ప్రశ్నలు గుప్పించారు. ఇలా ఇంకెంత మంది రైతుల పరిహారం డబ్బులు చేతులు మార్చారో 167 కే భూసేకరణ అధికారులకే తెలియాలి. జిల్లా కలెక్టర్ వెంటనే తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకొని మళ్ళీ ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలి అని భాదిత రైతు కోరారు.

## ఉప్పల్ స్టేడియంలో క్రికెటర్ల సందడి



**ఉప్పల్, మార్చి 4 (నిఘా న్యూస్):** ఉప్పల్ స్టేడియంలో మంగళవారం టీమిండియా క్రికెట్లర్లు సందడి చేశారు. ఐపీఎల్-2025లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి కొత్తగా వచ్చిన ప్లేయర్లు ముందుగానే అక్కడికి చేరుకొని ప్రాక్టీస్ సెషన్ లో పాల్గొన్నారు. టీమిండియాలో స్థానం దక్కించుకున్న హర్షత్ పటేల్, రాహుల్ చాహర్ సహా ఇతర ప్లేయర్లు ప్రాక్టీస్ లో పాల్గొన్నారు. మరో రెండు రోజుల్లో నితిష్ రెడ్డి సహా కీలక ప్లేయర్లు ప్రాక్టీస్ లో పాల్గొంటారు.

## రంగాయ్ పల్లి చెరువులోకి గోదారమ్మ నీళ్లు



**సిద్దిపేట, మార్చి 4 (నిఘా న్యూస్):** మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు కృషితో చెరువుల్లోకి కాళేశ్వరం జలాలు. కాళేశ్వరం కుంగింది అన్న కుహనాగాళ్ళకి ఇదే సజీవ సాక్ష్యం అంటున్న పల్లె ప్రజలు. రంగాయ్ పల్లికి కెసిఆర్, హరీష్ రావు లు తెచ్చిన,కాళేశ్వరం జలాల్లో మునగండి అని హెచ్చరించిన ప్రజలు. ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. రంగాయ్ పల్లి, విఠలాపూర్, కొత్త పల్లి గ్రామాల ప్రజలు. చెరువు వద్ద గోదారమ్మకు హారతి పట్టి స్వాగతం పలికిన మహిళలు గ్రామాల ప్రజలు.

విచక్షణ కోల్పోయిన...

# చెవిరెడ్డిని జైలుకి పంపి సరిచేస్తాం

- దాగుడు మూతలు వద్దు ముఖాముఖి చర్చకు దమ్ముంటే రమ్మని సవాల్
- చెవిరెడ్డి అవినీతి ఆస్తులపై ఇంటింటికి కరపత్రాలు
- చంద్రబాబు పెట్టిన బిక్షతో చెవిరెడ్డి కొడుకు బయట తిరుగుతున్నాడు
- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి పై ఘాటైన వ్యాఖ్యలు చేసిన పులివర్తి సుధా రెడ్డి



**చంద్రగిరి, మార్చి 4 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద మీడియా సమావేశం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి,టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ చాటుమాటు రాజకీయాలు మానుకో-మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికగా నిరాధార ఆరోపణలు చేస్తూ దాగుడు మూతలు ఆడుతున్నావు, నీవద్ద ఉన్న ఆధారాలతో ముఖాముఖికి రావాలని సవాల్ చేశారు.దాగుడు మూతలకు చెక్ పెట్టేందుకు టవర్ క్లాక్ వద్ద మంగళవారం ప్రత్యక్ష ముఖాముఖికి పులివర్తి సుధారెడ్డి సవాల్ విసిరారు. నిరాధార ఆరోపణలతో మహిళలను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారంటూ ఆరోపించారు. ఓటమితో విచక్షణ కోల్పోయారు, ఎన్నికల్లో ఓడిపోయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మితిమీరిన ఆరోపణలు చేస్తున్నారన్నారు. మహిళలపై నిందలు వేయడం దారుణం, వ్యక్తిగత దూషణలు,అబద్ధపు ఆరోపణల ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. 50లక్షల లంచం తీసుకున్నానని ఆరోపించడం కాదు,ఆధారాలు ఉంటే బయటపెట్టాలని బహిరంగంగా సవాల్ విసిరారు. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో ఆడవాళ్లను అవమానిస్తూ రాజకీయాలు చేసిందని విమర్శించారు.టవర్ క్లాక్ వద్ద చెవిరెడ్డికి బహిరంగంగా ముఖాముఖికి రావాలని ఫోన్ చేసినారు. చెవిరెడ్డి అవినీతి చేశారని, చట్టప్రకారం చెవిరెడ్డి జైలుకు వెళ్తారని ఆరోపించారు. చంద్రగిరి పట్టణంలో చెవిరెడ్డి సతీమణి, కుటుంబ సభ్యుల ఆస్తులపై ఇంటింటికీ చెవిరెడ్డి అవినీతి ఆస్తుల కరపత్రాలను పంచిపెట్టారు. చెవిరెడ్డి గత ఐదేళ్లుగా మఠం భూములను దోచుకున్నారని విమర్శించారు. మగవాళ్లు మగవాళ్ల తోనే పోరాడాలి-నానిని ఎదుర్కొనే ధైర్యం లేక, మహిళపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. రేపటి నుంచి చెవిరెడ్డి అవినీతిపై పోరాటం ప్రారంభిస్తానని పేర్కొన్నారు. చంద్రగిరిలో 30ఏళ్లుగా గెలవకపోయినా పార్టీ కార్యకర్తలు నిబద్ధతతో పని చేశారని ప్రశంసించారు. చంద్రబాబు పెట్టిన బిక్షతో చెవిరెడ్డి కొడుకు బయట తిరుగుతున్నాడు. చాటుమాటు రాజకీయాలు మానుకోమని ఎమ్మెల్యే సతీమణి తెలుగుదేశం నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని హెచ్చరించారు.

ఇంటర్ పరీక్షలకు...

# ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి




మధిర మార్చి 4(నిఘా న్యూస్) మధిర మండల కేంద్రంలో బుధవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మధిర ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ముఖ్య పర్యవేక్షణ అధికారి బట్టేపాటి జైదాస్ తెలిపారు.ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన వివరించారు.ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర పరీక్షలు వ్రాయబోయే విద్యార్థుల కోసం మధిర పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ ముస్లిం మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, సుశీల జూనియర్ కళాశాల,శ్రీనిధి జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు సౌకర్యం, వైద్య సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరానికి చెందిన మొత్తం 2020 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు అని ఇందులో మొదటి సంవత్సరానికి చెందిన 1,048 రెండవ సంవత్సరానికి చెందిన 972 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే పేపర్లను తెరిచి పూర్తయ్యాక సీజ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా పరీక్షా కేంద్రంలో ఉన్న సీసీ కెమెరాలకు హైదరాబాద్ ఇంటర్మీడియట్ బోర్డు కమాండ్ కంట్రోల్ వ్యవస్థకు అనుసంధానం చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులను అనుమతిస్తామని, అదేవిధంగా గరిష్టంగా తొమ్మిది గంటల ఐదు నిమిషాల వరకు విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు, ప్రింటెడ్ మెటీరియల్‌ను వెంట తీసుకుని రావద్దని సూచించారు.

# పురుషుల కంటే మహిళల్లోనే నిబద్ధత ఎక్కువ

- మహిళలను గౌరవించే చోట దేవతలు కొలువై ఉంటారు: సీపీ
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**నాగోల్, మార్చి 4(నిఘా న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాచకొండ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నాగోల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల రాచకొండ పోలీసు మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమీషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. మన దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు మెరుగ్గా రాణిస్తున్నారని, లాయర్లుగా, పోలీసు అధికారులుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా, విద్యావేత్తలుగా, మరెన్నో ఇతర రంగాల్లో పని చేస్తూ తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని దేశాభివృద్ధికి అందిస్తున్నారని పేర్కొన్నారు. పురుషుల కంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువ అని, రాచకొండ పోలీసు కమిషనరేట్ లో పలు విభాగాల్లో వందల మంది మహిళలు సమర్థవంతంగా పని చేయడం పట్ల కమీషనర్ హర్షం వ్యక్తం చేశారు. రాచకొండ కమిషనరేట్ మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మల్కాజీగిరి పద్మజ, డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్, డీసీపీ అడ్మిన్ ఇందిర, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డిసిపి రోడ్ సేఫ్టీ మనోహర్, డిసిపి ట్రాఫిక్ -1 మల్లారెడ్డి, డిసిపి ట్రాఫిక్ 2 శ్రీనివాసులు, డీసీపీ వుమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రితో పాటు పలువురు రాచకొండ కమిషనరేట్ మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐపీఎల్‌కు ముస్తాబవుతున్న ఉప్పల్ స్టేడియం

### టిక్కెట్ల విక్రయంలో పారదర్శకత పాటించాలని ఆదేశం

### హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు



**ఉప్పల్, మార్చి 4 (నిఘా న్యూస్):** ఐపీఎల్-18వ సీజనకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు వెల్లడించారు. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) యాజమాన్యంతో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఐపీఎల్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రావు మాట్లాడుతూ ఐపీఎల్ పాలకమండలి నిబంధనల ప్రకారం అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్‌ఆర్‌హెచ్ సిబ్బందిని ఆదేశించారు. గత ఏడాది కార్పొరేట్ బాక్సుల్లోని ఏసీలు, వాష్‌రూమ్స్ వల్ల కొన్ని చోట్ల తలెత్తిన సమస్యలు ఈసారి పునరావృతం కావద్దని సూచించారు. టిక్కెట్ల విక్రయం పూర్తి పారదర్శకంగా జరగాలని, స్టేడియంలో విక్రయించే ఆహార పదర్థాలు నాణ్యత బాగుండాలని, అధిక రేట్లకు విక్రయించవద్దని చెప్పారు.అనంతరం డ్రెసింగ్ రూమ్స్, కార్పొరేట్ బాక్సుల్లో జరుగుతున్న పనులను ఉపాధ్యక్షుడు దల్జిత సింగ్, సహాయ కార్యదర్శి బసవరాజు, కోశాధికారి సీజే శ్రీనివాస్, కౌన్సిలర్ సునీల్ కుమార్‌తో కలిసి జగన్ మోహన్ రావు పర్యవేక్షించారు. ఈ సమావేశంలో బీసీసీఐ నుంచి వైభవ్, యువరాజ్, హెచ్‌సీఏ సీఈఓ సునీల్, ఎస్‌ఆర్‌హెచ్ నుంచి శరవణన్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాండర్ షైన్ స్కూల్లో ... బొట్టు కడిగేయించిన ప్రిన్సిపాల్

### విద్యార్థులు బొట్టు పెట్టుకుని వచ్చారని అభ్యంతరం

### కుటుంబ సభ్యులు , హిందూ వాహిని ఆర్గనైజర్ల ఆందోళన

### ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేసిన యాజమాన్యం



**అబ్దుల్లాపూర్‌మెట్, మార్చ్ 4(నిఘా న్యూస్):** పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాండర్ షైన్ స్కూల్ విద్యార్థులు బొట్టు పెట్టుకుని స్కూలుకు హాజరైనందుకు స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మయ్య విద్యార్థులను వాష్ రూమ్ కి తీసుకెల్లి బొట్టు తుడుపేయించారని విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడంతో కుటుంబ సభ్యులు స్కూల్ ముందు ఆందోళనకు దిగారు. విషయం హిందూ వాహిని ఆర్గనైజర్స్ కు తెలియడంతో కుటుంబ సభ్యులతో కలిసి స్కూల్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దిగివచ్చిన యాజమాన్యం ప్రిన్సిపల్ లక్ష్మయ్య ను సస్పెండ్ చేసినట్టు తెలపడంతో కుటుంబ సభ్యులు హిందూ వాహిని ఆర్గనైజర్ ఆందోళన విరమించారు.

## అయ్యప్ప దేవాలయాన్ని సందర్శించిన ఎమ్మార్వో

### పార్కు స్థలాన్ని వినియోగిస్తున్న దేవాలయం

### సర్వే చేసి జిహెచ్‌ఎంసికి నివేదిక సమర్పిస్తానన్న ఎమ్మార్వో



**అంబర్‌పేట, మార్చ్ 4 (నిఘా న్యూస్):** బాగ్ అంబర్ పేట్ శ్రీ గురువాయురప్ప (అయ్యప్ప) దేవాలయాన్ని అంబర్ పేట ఎమ్మార్వో వీరాభాయి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బిక్షపతి, సర్వేయర్ కిరణ్ కుమార్‌లు మంగళవారం సందర్శించారు. దేవాలయం పక్కన ఉన్న జిహెచ్‌ఎంసి స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించి ఆ స్థలాన్ని పరిరక్షించాలని అయ్యప్ప స్వాములు ఇటీవల తహసిల్దార్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్వాముల విజ్ఞప్తి మేరకు ఎమ్మార్వో దేవాలయాన్ని సందర్శించి స్థలాన్ని పరిశీలించారు.దేవాలయం పక్కన ఉన్న 500 చదరపు గజాల స్థలం పార్కు కోసం వదిలిన జిహెచ్‌ఎంసికి చెందిన స్థలం అని, గతంలో ఇక్కడ సంస్కృత పాఠశాల ఉండేదని అయ్యప్ప స్వాములు ఎంఆర్‌ఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ స్థలాన్ని దేవాలయ కమిటీ కబ్జా చేసి అక్రమంగా పార్కింగ్ కోసం ఉపయోగిస్తుందని స్వాములు ఫిర్యాదు చేశారు. ఈ స్థలం సంబంధించి సర్వే నిర్వహించి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కు, జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తానని ఎమ్మార్వో తెలిపారు.

ఆఫర్ల పేరుతో.. మాక్సామ్స్ బేకరీలో...

# పాడైన కూల్ కేక్ ల విక్రయం

- యధేచ్చగా గడువుతీరిన కేక్‌లు, ఐస్ క్రీమ్ ల అమ్మకాలు
- జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో గుట్టురట్టు




**అంబర్‌పేట, మార్చ్ 4(నిఘా న్యూస్):** వేసవికాలం మీరు కూల్ కేక్‌లు తింటున్నారా ఆఫర్ ఉందని తక్కువ ధరకు వస్తుందని కూల్ కేకులు ఎగబడి కొంటున్నారా 1.5 కేజీ కూల్ కేక్ కేవలం రూ.300. దానికి అర లీటరు వెనిల్లా ఐస్ క్రీమ్ ఫ్రీ అంటే నమ్మి కొంటున్నారా..? అయితే మీరు పప్పులో కాలేసినట్టే. ఈ కూల్ కేక్‌లు తింటే మీ ఆరోగ్యాలతో మీరు చెలగాట మాడుతున్నట్లే. ఎందుకంటే ఆ కేక్ లు పాడైపోయి గడువు తీరి ఉంటున్నాయి. ఐస్ క్రీమ్‌ల గడువు కూడా తీరిపోయి ఉంటుంది. ఆఫర్ల పేరుతో వినియోగదారులను మోసం చేసే విధానం ఇది. ఇదంతా ఎక్కడా అని ఆలోచిస్తున్నారా,మన అంబర్ పేట ఛే నెంబర్ చౌరస్తాలోని మాక్సామ్స్ బేకర్స్ ఐస్ క్రీం దుకాణంలో జరుగుతున్న మోసం. ఆఫర్ల పేరుతోఈ బేకరీ యజమాని వినియోగదారులను పచ్చి మోసం చేస్తున్నారు. పాడైపోయిన, గడువుతీరిన కేక్‌లు, ఐస్ క్రీమ్ లను విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ అధికారులు, జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఈ బేకరీపై దాడులు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ ఎస్సై కరుణాకర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి తమ సిబ్బందితో కలిసి మాక్సామ్స్ బేకరీ పై దాడి చేసి లోపల తనిఖీలు నిర్వహించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. బేకరీ లోపల గల ఫ్రీజర్లో నిల్వ ఉంచిన కూల్ కేక్ లు పాడైపోయి కనిపించాయి. దాదాపు 20 రోజుల క్రితం తయారుచేసిన కూల్ కేకులు పాడై ఫ్రీజర్లోనే కారిపోతున్నాయి. ఐస్ క్రీమ్ ల సంగతి అంతే. ఈ బేకరీ లో పెద్ద సంఖ్యలో గడువు తీరిన కూల్ కేకులు , ఐస్ క్రీములు అధికారులకు దర్శనమిచ్చాయి. దీంతో అధికారులు వాటి శాంపిళ్లను స్వాధీనం చేసుకుని పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు తరలించారు. అలాగే ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు అంబర్ పేట అలీకేఫ్ సమీపంలో మరో బిస్కట్ల తయారీ ఖారా?నలో కూడా తనిఖీలు జరిపారు. ఖారా?నలో తనిఖీలు చేసిన అధికారులు అక్కడ కొన్ని బిస్కట్లను కూడా షాంపిళ్లుగా సేకరించారు. ఈ తనిఖీల్లో ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com